**మంచిమాట**

నీకున్నదంతా ఏదో ఒకరోజున
ఇచ్చేయాల్సిందే. నీవెంట ఏదీ
తీసుకెళ్ళలేవు. అంచేత
ఆ ఇచ్చేదేదో ఇప్పుడే ఇవ్వు.
ఇచ్చే గొప్ప అవకాశాన్ని నువ్వే
వాడుకో. ఇవ్వడంలోని ఆనందాన్ని
అనుభవించాల్సింది నువ్వేకానీ
నీ వారసులు కాదు.

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ,
రాజకీయ, వివాహ,
జన్మదిన తదితర ప్రకటనల
కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | సంపుటి : 1 | సంచిక : 345 | శనివారం , జూన్ 13, 2026 | పేజీలు - 8 | వెల: 2 /- | ఎడిటర్ : దూసరి రవీందర్ గౌడ్

## శాంతిభద్రతల కారణంగానే
# పవన్ సభకు నిరాకరణ

### - తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి
- తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు
- కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు
- హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా
- మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్
- ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ



**న్యూఢిల్లీ,జూన్ 12 :** తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో

మిగతా2లో...

## యధాతథంగా సింగరేణి
# మెడికల్ బోర్డు

- పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి
- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్,జూన్ 12 :** సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహి తంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు

మిగతా2లో...

# రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

### - విజేతల జాబితాలో ఖర్గే, తరుణ్ చుగ్



**న్యూఢిల్లీ,జూన్ 12:** రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు

మిగతా2లో...

## సంక్షేమ శాఖలో అవినీతి
# అంతా అబద్ధం

- నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు
- హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన



**సిద్ధిపేట,జూన్ 12:** సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్

మిగతా2లో...

## సర్ ప్రక్రియ ..
# ఓ భూతం లాంటిది

### చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం
### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం,జూన్ 12 :** ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.

మిగతా2లో...



## మీనాక్షికి సుప్రీంలో
# దక్కని ఊరట

### నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత
### ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన

**న్యూఢిల్లీ,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి

మిగతా2లో...

## భారత నావికుల మృతిపై
# స్పందించని ప్రధాని

### - అమెరికాకు లొంగిపోయాడంటూ రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ,జూన్ 12 :** గతవారం అమెరికా బలగాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టెబెల్లో' నౌకపై చేసిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. ఈ ఘటనపై ప్రధాని మౌనం వహించడంపై శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం

మిగతా2లో...

# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి



2లో

## రేవంత్ రెడ్డి నియంత పాలనకు
# రోజులు దగ్గర పడ్డాయి

- ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం
- కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం



2లో

TGTEL/25/A1132
జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా? మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు.

ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

# మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

**ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి**

**రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ**

**మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

**హైదరాబాద్,జూన్ 12 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుం డా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు.మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించా రు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజ న్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినంద నలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోటు ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటు న్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరు గుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరిం చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

# సర్ ప్రక్రియ .. ఓ భూతం లాంటిది

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు.

తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

# యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు.

కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు.

గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికేట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు. రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌పీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది.

# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

**న్యూఢిల్లీ,జూన్ 12:** యూరప్ అందించే ఆయుధాలతో ఇండియాపై దాడులు జరుగుతున్నాయని, కానీ, యూరప్‌పై దాడులకు ఇండియా ఆయుధాలు అందించడం లేదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ విమర్శించారు. రష్యా నుంచి ఇండియా చమురు కొనుగోలు చేయడాన్ని వెస్టర్న్ కంట్రీస్ వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇండియా తరఫున జైశంకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫిన్లాండ్‌లో జరుగుతున్న కుల్టారంటా టాక్స్ కార్యక్రమంలో జైశంకర్ శుక్రవారం పాల్గొన్నారు.ఈ సందర్భంగా రష్యా నుంచి ఇండియా చమురు కొనుగోలు, యూరప్ దేశాల అభ్యంతరంపై మాట్లాడారు. రష్యా నుంచి ఇండియా చమురు కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యా నుంచి ఇండియా చమురు ఎలా కొంటుందని యూరప్ దేశాలు ప్రశ్నిస్తున్నాయి. దీనిపై జైశంకర్ ఘాటుగా స్పందించారు. యూరప్ దేశాల నైతికతపై ప్రశ్నించారు. యూరప్ దేశాలు ఆయుధాలు అందిస్తుంటే, ఇండియాపై దాడులు జరుగుతున్నాయన్నారు. అలాంటి దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలును ప్రశ్నించే అర్హత లేదన్నారు. అందుబాటు ధరలు, లభ్యతను బట్టి ఇండియా తన అవసరాలకు అనుగుణంగా చమురు కొనుగోలు చేస్తుందని చెప్పారు. రష్యా నుంచి చమురు కొనే యూరప్ దేశాలు మిడిల్ ఈస్ట్ నుంచి ఆయిల్ కొనడం వల్ల రష్యా చమురు భారీగా మిగులుతోందని, దీంతో తాము ఆ దేశం నుంచి ఆయిల్ కొంటున్నామని వివరించారు.గతంలో రష్యా నుంచి చమురు ఇండియా చమురు కొనుగోలును అమెరికా కూడా ప్రోత్సహించిందన్నారు. ఇండియాకు వ్యతిరేకంగా ఉన్న దేశాలకు యూరప్ దశాబ్దాలుగా ఆయుధాలు సరఫరా చేస్తోందని గుర్తు చేశారు. యూరప్ చాలా ఏళ్లుగా అమ్ముతున్న ఆయుధాలతోనే ఇండియాపై దాడి జరుగుతోందని చెప్పారు. అయితే, యూరప్‌పై దాడులకు మాత్రం భారత్ ఎలాంటి ఆయుధాలు అందించడం లేదన్నారు. యూరప్ ఆయుధాలు కూడా ఇండియాపై దాడికి రాకూడదన్నారు.

# భారత నావికుల మృతిపై స్పందించని ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. కాగా, 'అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన దాడుల్లో మూడు రోజుల్లోనే ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకు లొంగిపోయిన మన ప్రధాని మాత్రం ఇప్పటివరకు ఈ ఘటనపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు ప్రధాని స్పందించాలి. కానీ, ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరం. మన నావికుల్ని హత్య చేసిన కొద్దిరోజులకే.. అంటే వచ్చేవారమే జీ7 సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో మోడీ గారు చిరునవ్వు చిందిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ.. ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ చనిపోయిన ఈ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్కమాట కూడా మాట్లాడరు. తమ ప్రాణాలను బలిగొన్న వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ లేని ఒక లొంగిపోయిన ప్రధానమంత్రి 'భారతమాత' బిడ్డలను రక్షించలేరు' అని మోడీ తన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోడీని తీవ్రంగా విమర్శించారు.

# రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

**కరీంనగర్,జూన్ 12:** రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.

# మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

(మొదటి పేజీ తరువాయి)

నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల ప్రక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

మానవతకే TGTEL/25/A1132
జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# మహిళా సర్వీసుపై సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం బోయినపల్లి వినోద్ కుమార్



**హైదరాబాద్ :** సుప్రీంకోర్టు మానవాళికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. దేశంలో ఉన్న ప్రతి మహిళ సర్వీసు ను నెలకు 30 వేలుగా నిర్ధారించడం అభినంద నీయమని అన్నారు.దేశంలో సుప్రీంకోర్టు తీర్పులు పార్లమెంట్ చట్టాలతో సమానమని పేర్కొన్నారు.లీగల్ సెల్ నాయకులు లలితా రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమా మాట్లాడుతూ సమాజంలో మహిళల పనికి ఇప్పటి వరకు గుర్తింపు రాలేదని,గృహిణీపై పురుషులు ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. సుప్రీంకోర్టు మహి ళలను గౌరవిస్తూ సంచలన తీర్పు ఇచ్చిందని అన్నారు.మహిళలను యంత్రాలుగా చూసే సమాజంలో సుప్రీం కోర్టు తీర్పుతో మహిళలకు గుర్తింపు వచ్చిందని తెలిపారు.

# సీఎంను కలిసేలా చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరిన సర్పంచులు



**హైదరాబాద్ :** రాష్ట్రంలో మాజీ సర్పంచులు చేపట్టిన పనులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల విడుదల కోసం తెలంగాణ సర్పంచుల సంఘం నాయకులు డీజీపీ ఆనంద్ కు వినతి పత్రం సమర్పించారు. తమను సీఎంను కలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లాలో మాజీ సర్పంచులను, సర్పంచులు సీఎంను కలువకుండా ముందస్తు అరెస్టులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత 31 నెలలుగా మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. దీంతో మాజీ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బిల్లులు ఇవ్వాలని ఏ కార్యక్రమాలు చేసినా ముందస్తు అరెస్టులు చేస్తున్నారని, ముఖ్యమంత్రిని కలువకుండా అరెస్టు చేస్తున్నారని వాపోయారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కల్పిస్తే తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, సర్పంచుల సంఘం కార్యదర్శి కేశబోయిన మల్లయ్య యాదవ్, వై అరవింద్ రెడ్డి, సముద్రాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని నామరూపాలు లేకుండా చేసేందుకు కుట్రలు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**గోదావరిఖని :** సింగరేణి సంస్థను నామరూపాలు లేకుండా చేయడం కోసమే దుర్మార్గమైన ప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. రామగుండం 5 లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, టీజీబీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి ఆయన రామగుండం బొగ్గు నిల్వలను పరిశీలించి ప్రభుత్వం చూపిస్తున్న బొగ్గు నిల్వలు లెక్కల వాస్తవాలు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో వరుస కుంభకోణాలతో సంస్థనే ప్రశ్నార్థకం చేసేలా దోపిడీ జరుగుతోం దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుస కుంభకోణాలకు తెరలేపుతోందన్నారు. ఒకప్పుడు సింగరేణి సంస్థ ఈ ప్రాంతంలో అనేక మంది పేదవాళ్లకు ఉద్యోగాలు ఇచ్చిన సంస్థ అని, లక్షల కుటుంబాలు బతుకుదెరువు చూపించిన సంస్థ అని ఆయన గుర్తు చేశారు. కానీ ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీ కాంట్రాక్టర్లు, సోలార్ పవర్ ప్లాంట్, డెటోనేటర్ కాంట్రాక్ట్, పవర్ ప్రాజెక్టుల విషయంలో కుంభకోణాల పరంపర కొనసాగిస్తుందని ఆరోపించారు.అధికారిక లెక్కలు సింగరేణి వెబ్సైట్ ఉన్న లెక్కల ప్రకారం సింగరేణి వ్యాప్తంగా ఆయా గనులపై 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వ ఉందని ప్రభుత్వం లెక్కలు చూపిస్తున్నదని పేర్కొన్నారు.5 లో 6 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వ చేసి ఉందని, ప్రస్తుతం 3 లక్షల 60 వేల టన్నులు అని చెప్తున్నారని, కానీ ఇక్కడికి వచ్చి చూస్తే మొత్తం మట్టి బెడ్డలు బండలు పనికి రాని వాటిని కుప్పలు చేసి బొగ్గు అని చూపించే ప్రయత్నం చేస్తున్నారని, కేవలం ఇక్కడ 50 వేల మెట్రిక్ టన్నులు కూడా ఉన్నట్లు కన్పించడం లేదని ఆయన అన్నారు. సింగరేణి సంస్థను సర్వనాశనం చేయడంతో పాటు కార్మికుల జీవితాలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నేతృత్వంలోనే అనేక అరాచకాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. నిల్వలు ఎక్కడెక్కడ చూపిస్తున్నరో అక్కడ ఇదే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంపై సీబీఐ ఎంక్వైరీ జరుపాలని, లేని బొగ్గును ఎలా సృష్టిస్తరో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని వృథా చేయడంలో ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం చేస్తుందో అర్థం అవుతుందన్నారు. సింగరేణి ప్రజల ఆస్తి అని ఆ ఆస్తిని కాపాడాల్సిన బాధ్యతప్రభుత్వంపైఉందన్నారు.

## సర్కారు బడిలో చేరాలని కనగర్తిలో ప్రచార రథంతో ప్రచారం

**ఓదెల, జూన్ 12:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి జిల్లా పరిషత్ హై స్కూల్లో అడ్మిషన్ తీసుకోవాలని కోరుతూ ఆ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ప్రజాప్రతినిధులు వినూత్నంగా ప్రచార రథంతో శుక్రవారం గ్రామంలో తిరుగుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడ పాఠశాలలో సౌకర్యాలతో పాటు విద్యా బోధన జరుగుతుందని తెలుపుతున్నారు. ఈ పాఠశాలలో సౌకర్యాలు, సాధించిన విజయాలను తెలిపే కరపత్రాలను ముద్రించి ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలను తలపించే విధంగా ఇక్కడ ప్రభుత్వ బడుల ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకర్షిసున్నారు.ప్రైవేట్ బడుల మోజు వద్దని ప్రభుత్వ బడిలో పేద ప్రజలకు అన్ని రకాల ఉచితాలు అందుతున్న తీరును వివరిస్తున్నారు. ఇక్కడ వినూత్నంగా ప్రచార రథం వినియోగించడం ప్రజలను ఆకట్టుకుంటుంది. కాగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఈసారి ఉపాధ్యాయులు వివిధ రకాల ప్రచారాలతో



ప్రజల దగ్గరకు వెళుతున్నారు. పిట్టల ఎల్లయ్య పల్లె లో విద్యార్థి అడ్మిషన్ తో పాటు ఉపాధ్యాయులు ఇంటికి మొక్కను అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొప్పరి సంధ్య-కుమార్, ఎంఈవో రమేష్, ఉపాధ్యాయులు, జీపీ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో శనివారం బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ కార్యకర్తల సమ్మేళనం హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేములవాడ, జూన్ 12:** వేములవాడ నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ముఖ్య కార్యకర్తల సమ్మేళనం వేములవాడ పట్టణంలో శనివారం నిర్వహిస్తున్నారు. కార్యకర్తల సమ్మేళనానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జీవన్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్ హాజరవుతున్న క్రమంలో శుక్రవారం మహారాజా ఫంక్షన్ హాల్లో ఏర్పాట్లను వేములవాడ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు తోట ఆగయ్య, సభ్యత్వ నమోదు ఇంచార్జ్ గూడూరి ప్రవీణ్ కుమార్ పరిశీలించారు.సభ్యత్వ నమోదు, సర్ పై శిక్షణ తరగతులు, పార్టీ బలోపేతంపై నాయకులకు దశ దిశ నిర్దేశించనున్నారు. సుమారు 800 మంది కార్యకర్తలు హాజరవుతున్న క్రమంలో ఇందుకు చేయాల్సిన ఏర్పాట్లను వారు



పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కందుల క్రాంతి కుమార్, రామతీర్థపు రాజు, రాఘవరెడ్డి, నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి రామచందర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, కొండ కనకయ్య, ప్రేమ్ చారి తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో పారిశుద్ధ్య పనుల ఆకస్మిక తనిఖీ

**వేములవాడ, జూన్ 12 :** వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని పారిశుధ్య పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. మురికి కాల్వలలో పేరుకు పోయిన చెత్తాచెదారం, రహదారులపై వేస్తున్న చెత్త డంపులు, కాలనీలో పరిశుభ్రతపై వారు తనిఖీ చేసి మాట్లాడారు. వర్షాకాలం సందర్భంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అక్రమంగా రహదారులపై చెత్త డంపులు వేసిన వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. మురికి కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి వరదనీటితో కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా



పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇక్కడ సానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్ తదితరులు ఉన్నారు.

## టీయూడబ్ల్యూజే కామారెడ్డి జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఈ మేరకు అధ్యక్షుడిగా రజనీకాంత్, కార్యదర్శిగా తోట రాజేష్, కోశాధికారిగా ముదాం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సయ్యద్ కౌసర్అలీ, ఎండీ అబీద్, ముదాం శంకర్ పటేల్ , యు.బాలయ్య, ఎండీ యూనస్, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, సాయి ప్రసాద్, కే శ్రీనివాస్ రావు, యూ రామకృష్ణ, లక్ష్మీనారాయణ, కార్యవర్గసభ్యులుగా శ్రీకాంత్, ఈ వెంకటేశ్వర్లు, ఇంజమూరి శ్రీనివాస్, కే గంగాధర్, జే బాలప్రకాష్, ఎండీ వాజీద్ అలీ, జీ శ్రీనివాస్, మేకల రవి, భవాని ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా పీ శ్రీనివాస్, కార్యదర్శిగా బీ సుధాకర్గౌడ్, కోశాధికారిగా జీ సత్య నారాయణగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంఏ మజీద్, సహాయ కార్యదర్శులుగా రామేశ్వరరావు, ఎన్ సాయిరాం, జే వీరయ్య, రవీందర్ గౌడ్, కార్యవర్గసభ్యులుగా అవునూరి ఆశన్న, ఎండీ రజాక్, పోచయ్య, గంగాధర్, బన్సీలాల్, దినకర్, ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు.

## చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని రైతుల నిరాహార దీక్ష



**పాల్వంచ, జూన్ 12 :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 48వ డివిజన్లో ఎర్రగుంట గ్రామంలోని చెరువును ఆక్రమణ దారుడి నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ గ్రామ రైతులు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. చెరువు వద్ద టెంట్ వేసి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ నిరాహార దీక్షలు చేపట్టారు. చెరువును ఓ వ్యక్తి ఆక్రమించి శిఖం భూమి సాగు చేస్తూ చెరువులోని నీరంతా వెళ్లగొట్టి పంట పొలాలకు నీళ్లు లేకుండా, అలాగే పశువులు తాగేందుకు నీళ్లు లేకుండా చేయడాన్ని నిరసిస్తూ రైతులు ఈ నిరసన చేపట్టారు. ఆక్రమణదారుడు పట్టా ఉందని చెప్పి, చెరువు మొత్తం తనదేనంటూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి చెరువును కాపాడాలని రైతులు కోరారు.

ఆక్రమణదారుల నుండి చెరువును కాపాడేంత వరకు ఈ రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని రైతులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ నాయకుడు దొడ్డ రవికుమార్, రైతులు మండల వెంకన్న, సత్యనారాయణ, మేక ప్రసాద్, నరసింహమూర్తి, తోడేటి సత్యం, రెడ్డిమల్ల వెంకటయ్య, ఆరేపల్లి సత్యనారాయణ, ఆంజనేయులు, శంకర్, బూరా వెంక టేశ్వరావు, మేక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



**బాన్సువాడ రూరల్, జూన్ 12 :** వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని గ్రామ బోర్లం క్యాంపు సర్పంచ్ కుంటోల్ల లక్ష్మి అన్నారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్యపు పనులను వార్డు సభ్యుడు హరికృష్ణతో కలిసి శుక్రవారం పరిశీలించారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని పూర్తిగా తొలగించాలని కార్మికులకు ఆమె సూచించారుగ్రామస్తులు ఇంట్లో సేకరించిన చెత్తను రోడ్లపై పారవేయకుండా డస్ట్ బిన్ లో నిలువచేసి ప్రతీరోజు ఇంటి ముందుకు వచ్చే గ్రామపంచాయతీ ట్రాక్టర్లలో చెత్తను వేయాలని ఆమె గ్రామస్తులకు సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయడం వల్ల దోమల బెడద ఎక్కువ అవుతుందని, వాటి వల్ల గ్రామస్తులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.

# ఈ నెల 21 నీట్ యూజీ పరీక్ష

**వినాయక్ నగర్, జూన్ 12 :** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 21న రీ-ఎగ్జామినేషన్ ఆఫ్ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్, నీట్ యూజీ-2026 నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి ఎస్పీ, నిజామాబాద్ ఇన్చార్జి సీపీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎగ్జామ్ సెంటర్స్ వద్ద పోలీసులు అవసరమైన భద్రత చర్యలు చేపట్టనున్నట్లుగా పేర్కొన్నారు. అందు కోసం కమిషనరేట్ పరిధిలో ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద, పరిసర ప్రాంతాల్లో 21న ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు 163 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.



గవర్నమెంట్ గిరిరాజ్ కాలేజ్ (నిజామాబాద్) పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రెండు షిఫ్టులుగా పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాప్స్ మూసి ఉంచాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఉంటుందని, సెంటర్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంటుందని, గుంపు లుగుంపులుగా తిరగవద్దని చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్చార్జి సీపీ రాజేష్ చంద్ర హెచ్చరించారు.

మనవాణికి జనంవార్త TGTEL/25/A1132
ప్రతి అక్షరం.. జనం కోసం..

# అమెరికా క్షిపణి దాడిలో విశాఖ వాసి మృతి

**అమరావతి :** ఇటీవల ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్ నౌకపై అమెరికా చేసిన మిసైల్ దాడిలో విశాఖ పట్నం శ్రీవారిపురానికి చెందిన సురేష్ పట్నాల మృతి చెందారు. ఈ దాడిలో ముగ్గురు భారతీయులు మృతి చెందారు. సురేష్ ప్రయాణిస్తున్న నౌక ప్రస్తుతం ఒమన్ తీరానికి 35 వాటికన్ మైళ్ల దూరంలో నిలిచిపోయింది. ఒమన్ అధికారులు రాత్రి నౌకను తీరానికి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం విచారం వ్యక్తం చేసింది. మృతదేహాన్ని త్వరగా స్వస్థలానికి రప్పించేలా ఎంబసీలతో మాట్లాడాలని సీఎం చంద్రబాబు ఏపీ భవన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వపరంగా సురేష్ కుటుంబాన్ని ఆదుకుంటామని వెల్లడించారు. సురేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.



# వెన్నుపోటుకు రెండేళ్లుఏపీలో
## వైసీపీ ఆధ్వర్యంలో నిరసనలు

**అమరావతి :** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న సందర్భంగా వైసీపీ నాయకులు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు వెన్నుపోటు కు రెండేళ్లు కార్యక్రమాలను నిర్వహించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటుకు గురిచేసిందని ఆరోపిస్తూ నగిరిలో మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. ఒకప్పుడు ప్యాకేజీ స్టార్‌గా ఉన్న పవన్ కల్యాణ్ నేడు క్యాబేజీ స్టార్‌గా మారిపోయారని అన్నారు. సుగాలి ప్రీతి కేసులో న్యాయం చేస్తానని ప్రకటించి ఇంతవరకు న్యాయం చేయలేదని విమర్శించారు. మహిళలకు అండగా ఉంటామని




చెప్పిన ప్రభుత్వం చివరకు వెన్నుపోటు పొడిచిందని వ్యాఖ్యానించారు.నంద్యాల జిల్లా డోన్‌లో నిర్వహించిన నిరసనలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ కళ్లు తెరవక పోతే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# 7 రోజులుగా అడవిలో కానరాని చిన్నారి జ్ఞానేశ్వరి జాడ
## తండ్రి స్నేహితులే కిడ్నాప్ చేశారా

**కాకినాడ జిల్లా:** తునిలో కలకలం రేపిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి(జాను) అదృశ్యం కేసు రోజురోజుకూ మిస్టరీగా మారుతోంది. పాప కనిపించకుండా పోయి ఏడు రోజులు గడిచినా ఇప్పటికీ ఎలాంటి స్పష్టమైన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఈ కేసులో పెంపుడు కుక్క కీలకంగా మారింది. ఆ శునకానికి జీపీఎస్ ట్రాకర్ అమర్చడం ద్వారా పాన ఆచూకీని కనిపెట్టాలని అనుకుం టున్నారు.కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం సమీపంలోని 50 ఎకరాల పామాయిల్ తోటకు గణేశ్–భవానీ దంపతులు కాపలదారులుగా పనిచేస్తున్నారు. వాళ్ల రెండేళ్ల కుమార్తె జ్ఞానేశ్వరి గత శనివారం ఉదయం తమ పెంపుడు కుక్కతో కలిసి అడవి వైపు వెళ్లింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు చిన్నారి ఆచూకీ కోసం చుట్టుపక్కల అంతా వెతికారు. ఎక్కడా పాప ఆచూకీ కనిపించకపోవడంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దాదాపు 200 మంది పోలీసు సిబ్బంది దాదాపు 500 ఎకరాల అటవీ కొండ ప్రాంతాన్ని గాలించారు. కానీ పాప ఆచూకీ దొరకలేదు. అయితే మంగళవారం మధ్యాహ్నం పాపతో వెళ్లిన కుక్క తిరిగొచ్చింది. కానీ చిన్నారి మాత్రం తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.అయితే తోటకు తిరిగొచ్చిన శునకం అక్కడ ఉన్న పోలీసులు, కుటుంబసభ్యులను చూసి భయపడి



తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది. దీంతో దాన్ని పట్టుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. చివరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు యువకులు చాకచక్యంగా వ్యవహరించి శునకాన్ని పట్టుకున్నారు. అయితే ఆ కుక్క ప్రస్తుతం ఆందోళనలో ఉండటంతో దాన్ని శాంతపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. చిన్నారి తల్లిదండ్రులు కూడా శునకాన్ని మచ్చిక చేసుకునే పనిలో ఉన్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా జీపీఎస్ ట్రాకర్ తీసుకొచ్చి పోలీసులు ఆ కుక్కకు అమర్చారు. కుక్క తిరిగే మార్గాలను గుర్తించడం ద్వారా చిన్నారి ఆచూకీని కనిపెట్టాలని భావిస్తున్నారు. నిజంగానే పాప అడవిలో తప్పిపోయిందా లేదా ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారా అన్న కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే చుట్టుపక్కల గ్రామాల్లోని సీసీటీవీ కెమెరాలను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వాహనాల రాకపోకలను కూడా ఆరా తీస్తున్నారు. అయితే తన కుమార్తెను భర్త స్నేహితులే కిడ్నాప్ చేసి ఉంటారని భవానీ ఆరోపిస్తుంది. చిన్నారి తల్లి భవానీ మీడియాతో మాట్లాడుతూ తన కుమార్తె అడవిలో ఉండచకపోవచ్చని.. కచ్చితంగా ఎవరో తీసుకెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తన భర్త స్నేహితులతో గతంలోకొన్ని గొడవలు జరిగాయని.. వాటిని మనసులో పెట్టుకుని ఎవరైనా తన కుమార్తెను అపహరించి ఉంటారని తెలిపింది. 'మాతో ఏమైనా సమస్య ఉంటే నేరుగా మాట్లాడండి.. కానీ నా చిన్నారిని తీసుకెళ్లి అన్యాయం చేయకండి. నా బిడ్డను క్షేమంగా తీసుకురండి' అంటూ కన్నీటిపర్యంతమైంది.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న
## ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

**తిరుమల :** ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ శుక్రవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నా రు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీ కృష్ణ ,అర్చకులు సాంప్రదా యబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.దర్శనానంతరం రంగ నాయకులు మండపం వద్ద ఆమెకు పండితులు వేదాశీర్వచనం అందించగా



ఈవో, అదనపు ఈవో తీర్థ ప్రసా దాలు, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్య క్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మీ అబ్బ జాగీరా సిగ్గు లేదా మంత్రి
## సవితపై ఉష శ్రీ చరణ్ ఘాటు వ్యాఖ్యలు

**పెనుకొండ:**కూటమి ప్రభుత్వ పాలనకు రెండేళు పూర్తయిన సందర్భంగా ఏపీలో అధికార, విపక్షాలు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహి ంచాయి. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందించామంటూ కూటమి పార్టీలు సంబరాలు నిర్వహించగా.. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదంటూ చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో వైసీపీ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఈ క్రమంలోనే శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో వైసీపీ శ్రేణులు నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో మంత్రి సవితమ్మపై మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నీ అయ్య జాగీరా.. సిగ్గుందా నీకు అంటూ వ్యక్తిగతంగా విమర్శలకు దిగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత , స్థాయి సవిత కు లేదన్న ఉషశ్రీ చరణ్.. సొంతమామకు వెన్నుపోటు పొడిచి సవిత మంత్రి పదవి దక్కించుకుందంటూ ఆరోపించారు."నీ అబ్బ జాగీరా.. సవిత.. సొంత తల్లికి ద్రోహం చేసి, ఫోర్జరీ చేసి నాన్న ఆస్తిని




లాక్కునే ప్రయత్నం చేశావ్. సొంత తల్లికే అన్నం పెట్టని నువ్వు.. అన్నపూర్ణ క్యాంటీన్ పెడతావా. నిన్ను నమ్మి వచ్చిన వాళ్లను దగా చేసి నట్టేట ముంచావ్. ఇదే పెనుకొండలో ప్రతీ బాటిల్ మీద రూ.10 తింటున్నావ్, తాగుతున్నావ్ సిగ్గులేదా నీకు.. బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. దీని గురించి మాట్లాడమంటే.. జగన్ మోహన్ రెడ్డి గారిని అంటావా నువ్వు. ఎవరు నువ్వు నీ అర్హత ఏంది మీ మామకు వెన్నుపోటు పొడిచి ఫోర్జరీ కొట్టి డబ్బు వస్తే నువ్వు మంత్రి అయ్యావ్. ప్రజల గుండెల్లో సంక్షేమ సామ్రాట్‌గా ఉన్నారు జగన్. ఇంకొక్కసారి జగన్ గురించి మాట్లాడితే తోలుతీస్తాం. వైసీపీ అంటే నీతి, నిజాయితీ. జగన్ రోడ్డు వేస్తే సిగ్గులేకుండా నువ్వు ఫ్లెక్సీలు వేయించుకుంటావా. " అంటూ మంత్రి సవితపై ఉషశ్రీ చరణ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# కానిస్టేబుల్ హత్య కేసులో జీవితఖైదు
## పోలీసుల కళ్లుగప్పి పరారైన ఖైదీ

**కడప:** సెంట్రల్ జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న ఖైదీ రాజశేఖర్ పరారయ్యాడు అనారోగ్య కారణాల వల్ల ఏప్రిల్ నెలలో విశాఖ మానసిక ఆస్పత్రికి తరలించి, తిరిగి జైలుకు తరలిస్తుండగా గూడూరు రైల్వే స్టేషన్‌లో తప్పించుకుని పారిపోయాడు.వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని కాచిగూడకు చెందిన రాజశేఖర్ కొంతకాలం కిందట నంద్యాలకు వచ్చాడు. పట్టణంలోని రౌడీషీటర్లతో పరిచయాలు పెంచుకుని పలు దందాలు చేశాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అతనిపై పోక్సో కేసు కూడా నమోదైంది. ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన కానిస్టేబుల్ సురేంద్ర హత్య కేసులో ఏ2గా ఉన్న రాజశేఖర్‌కు కొంతకాలం కిందట జీవితఖైదు పడింది. ఈ క్రమంలో కడప సెంట్రల్ జైలులో అతను శిక్ష అనుభవిస్తు న్నాడు.రాజశేఖర్ మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తుండటంతో జైలు అధికారులు చికిత్స నిమిత్తం అతన్ని విశాఖపట్నంలోని మెంటల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందిన రాజశేఖర్‌నున వైజాగ్ నుంచి కడపకు తరలిస్తుండగా గూడూరు రైల్వే స్టేషన్లో పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుని పారిపోయాడు. అతను నంద్యాలకు వచ్చి ఉంటాడేమోనన్న అనుమానంతో పోలీసులు అలర్ట్ అయ్యారు.



### వైసీపీ ఆందోళనలో అపశ్రుతి బెదిరిపోయిన
## దున్నపోతు భయంతో పరార్

**ఎన్టీఆర్ జిల్లా :**నందిగామలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఏపీలో టీడీపీ కూటమి పాలనకు నేటితో రెండేళ్లు పూర్తి అవుతోంది. అయితే రెండేళ్లు పూర్తి అయినా కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని.. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలను తప్పి వెన్నుపోటు పొడిచారని ఆరోపిస్తూ వైసీపీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో రాష్ట్రవ్యప్తంగా వైసీపీ ర్యాలీలు నిర్వహించింది. ఈ క్రమంలోనే నందిగామలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఎనిరసనలో భాగంగా ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు ఇంటి నుంచి దున్నపోతుతో ర్యాలీ నిర్వహించారు. అయితే చుట్టుపక్కల జనం, వారి హడావిడిని చూసిన దున్నపోతు బెదిరి పోయింది. చుటుపక్కల వారిని పొడిచి అక్కడ నుంచి పారిపోయే ప్రయత్నం చేసింది. ఆర్డీవో కార్యాలయం వద్ద దున్నపోతుతో నిరసన చేస్తుండగా ఊహించని విధంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు వైసీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి.

మరోవైపు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమల్లో కూటమి సర్కారు నిర్లక్ష్యం వహిస్తోందని వైసీపీ ఆరోపణ. రెండేళ్లు పూర్తవుతున్నా కూడా ఇచ్చిన హామీలను అమలు చేయటం లేదని ఆరోపిస్తోంది. వైసీపీ హయాంలో అమలు చేసిన పథకాలను పేర్లు మార్చి అమలుచేస్తున్నారని.. అందులోనూ కోతలు విధిస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాల ఊసే లేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇచ్చిన హామీలను అమలు చేయటం లేదంటూ శుక్రవారం రోజున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దిష్టిబొమ్మల దహనం, భారీ ర్యాలీలు నిర్వహించారు.

# బిగ్ అలర్ట్ మూడు గంటల్లో పిడుగులతో వర్షాలు

**ఆంధ్రప్రదేశ్:** ప్రజలకు ముఖ్య గమనిక. వచ్చే మూడు గంటలలో ఏపీలోని కొన్ని జిల్లాలలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాగల మూడు గంటలలో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అరకు, మడగడ, బాకూరు, అనంతగిరి, గజపతినగరం, బొబ్బిలి, మక్కువ, సాలూరు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తెలిపింది. అలాగే తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచేందుకు అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది

**శనివారం ఈ జిల్లాలలో వానలు..**

మరోవైపు దక్షిణ కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం రోజున పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాలలో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. మిగతా జిల్లాల్లోనూ కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. తీరం వెంబడి ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ప్రజలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.




# ఆ ఆలయంలో "ఆ రూపంలో" శివలింగం 60 ఏళ్లకోసారి అద్భుతం

**తిరుపతి:**ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతికి సమీపంలో ఉంది గుడిమల్లం పరశురామేశ్వర ఆలయం ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామంలో ఈ పురాతన శివాలయం కొలువై ఉంది. ఈ ఆలయంలోని విగ్రహం దగ్గర నుంచి ఆలయ నిర్మాణం వరకూ.. ప్రతీ అంశం ఓ ప్రత్యేకతే. గుడిమల్లం ఆలయంలోని విగ్రహం పురుషాంగం ఆకారంలో ఉంటుంది. ఏడు అడుగుల పొడవు ఉండే విగ్రహంపై తలపాగా, ధోవతితో ఉన్న రూపం ఉంటుంది. ఈ రూపాన్ని రుద్రుడి రూపంగా భావిస్తారు. రుద్రుడి రూపం యక్షుడి భుజాలపై కొలువై ఉంటుంది. మొత్తం విగ్రహం ఆకృతి పురుషాంగం ఆకారంలో ఉండటం ఈ ఆలయం ప్రత్యేకత. అలాగే శివుడు లింగాకారంలో కాకుండా ఇలా మానవరూపంలో ఉండటం చాలా అరుదుగా చెప్తుంటారు.
గుడిమల్లం ఆలయం.. విగ్రహం అలా ఉండ




టానికి కారణమేంటిగుడిమల్లం ఆలయంలోని విగ్రహం పురుషా ంగం ఆకారంలో ఉండటం వెనుక పలు కారణాలు ఉన్నాయట. పూర్వపు రోజులలో మాతృస్వామ్య వ్యవస్థ ఉండేదని.. స్త్రీని కొలిచే ఆచారం ఉండేదట. అప్పట్లో యోని ఆకారాన్ని పూజించే ఆచారం ఉన్నట్లు చరిత్రకారులు చెప్తున్నారు. మాతృస్వామ్య వ్యవస్థ అంతరించి పురుషాధిక్యం పెరిగిన తర్వాత దానికి సూచికగా లింగం ఆకారాన్ని పూజించే ప్రక్రి య మొదలైనట్లు చెప్తారు. గుడిమల్లం ఆల యం క్రీ. పూ 2 వ శతాబ్దం లేదా 3వ శతాబ్దపు నాటిదిగా.. టున్నటుగా పురా వస్తు శాఖ అధికారులు భావిస్తున్నారు.

మనవాణికి
జనంవార్త
TGTEL/25/A1132
ప్రతి అక్షరం.. జనం కోసం..

# భారతీయులున్న నౌకపై అమెరికా దాడి యూఎస్ రాయబారికి రెండోసారి సమన్లు జారీ చేసిన ఇండియా



**అమెరికా:** భారతీయ నౌకలపై అమెరికా వరుసగా దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడు ల్లో ముగ్గురు భారతీయులు మరణించారు. ఈ నేపథ్యంలో దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇండియా.. మన దేశంలోని అమెరికా రాయబారి జేసన్ మీక్స్‌కు నిరసన తెలుపుతూ సమన్లు జారీ చేసింది. ఈ సమన్లు అందిం చిన తర్వాత కూడా ఇండియన్ వాణిజ్య నౌకలపై అమెరికా దాడి చేసింది. దీంతో మరో సారి అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసింది. 48 గంటల వ్యవధిలోనే యూఎస్ రాయ బారికి ఇండియా రెండుసార్లు సమన్లు జారీ చేసింది. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ఎంబసీగా పని చేస్తున్న మీక్స్‌ను కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి పిలిపించి, వివరణ కోరినట్లు తెలుస్తోంది. ఎంటీ జల్‌వీర్ అనే భారత వాణిజ్య నౌకపై హార్ముజ్ జలసంధి వద్ద, ఒమన్ తీరంలో షినాసో పోర్టు సమీపంలో గురువారం అమెరికా దాడి చేసింది. ఈ నౌకలో 20 మంది భారతీయులున్నారు. అంతకుముందు జూన్ 8న ఎంటీ మారివెక్స్ అనే నౌకపై కూడా అమెరికా దాడి చేసింది. ఈ నౌకలో 24 మంది భారతీయులు ఉండగా, 21 మందిని సహాయక సిబ్బందిని రక్షించారు. ముగ్గురు భారతీయులు మరణించారు. ఈ దాడులపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దాడులను ఖండిస్తూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటన చేసింది.

కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాలా కూడా ఈ దాడుల్ని ఖండించారు.

# హాట్‌కేకుల్లా స్పేస్‌ఎక్స్ ఐపీవో సేల్

## ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా ఎలన్ మస్క్



**న్యూయార్క్:** స్పేస్‌ఎక్స్ కంపెనీ సీఈవో ఎలన్ మస్క్ ఇప్పుడు ట్రిలియనీర్ అయ్యారు. ఆయన సంపద ఇప్పుడు లక్ష కోట్లు దాటేసింది. తాజాగా ఆ కంపెనీ ఐపీవో సేల్స్ జరిగాయి. హాట్‌కేకుల్లా ఆ కంపెనీ షేర్లు అమ్ముడుపోయాయి. అనూహ్య రీతిలో ఆయన సంపద పెరిగిపోయింది. హేమీహేమీ టైకూన్లను దాటివేస్తూ.. ఔత్సాహిక వ్యాపారి దశ నుంచి ట్రిలియనీర్‌గా ఆయన ఎదిగారు. రాకెట్లు, శాటిలైట్లు, ఏఐ కంపెనీలు, టెస్లా కార్లు.. మస్క్ వ్యాపారంలో ఉన్నాయి. అయితే తాజా ఐపీవో ద్వారా స్పేస్‌ఎక్స్ కంపెనీ 75 బిలియన్ల డాలర్లు ఆర్జించింది. ఇన్షియల్ పబ్లిక్ ఆఫరింగ్‌లో పెట్టుబడిదారులు ఉత్సాహంతో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో ఐపీవో సేల్‌లో ఒక్కొక్క షేర్‌ను 135 డాలర్లకు అమ్మేశారు. దీంతో మస్క్ రాకెట్, స్పేస్‌క్రాఫ్ట్ తయారీ కంపెనీ విలువ అమాతం పెరిగింది. మొత్తం 555.56 మిలియన్ల షేర్లను అమ్మేశారు. దాంతో ఆ కంపెనీకి ఐపీవో ద్వారా సుమారు 75 బిలియన్ల డాలర్లు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో స్పేస్, శాటిలైట్, ఏఐ కంపెనీల మొత్తం విలువ సుమారు 1.77 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ తొలిసారి శుక్రవారం వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్‌లోకి వెళ్లింది. నాస్‌డాక్‌లో ట్రేడింగ్ కోసం షేర్లను అమ్మిన అమెరికా కంపెనీల్లో స్పేస్‌ఎక్స్ ఏడో స్థానంలో ఉన్నది. ఫోర్బ్స్, ఆల్ఫాబెట్ కంపెనీలు కూడా గతంలో షేర్లను సేల్ చేశాయి. రెండో సంపన్న వ్యక్తి కేవలం 300 బిలియన్ల డాలర్ల దగ్గరే ఉన్నారని, అంటే మస్క్ దగ్గర ఉన్న దాంట్లో మూడో వంతు అని ఫోర్బ్స్ వెల్త్ ఎడిటర్ మాట్ డ్యూరట్ తెలిపారు.

ఒరాకిల్ ఫౌండర్ లారీ ఎల్లిసన్ సంపద సుమారు 400 బిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# పాకిస్థాన్ నేవీలోకి కొత్త సబ్‌మెరైన్

## చైనా నుంచి కరాచీ పోర్టుకు



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ అమ్ములపొదిలోకి కొత్త జలాంతర్గామి వచ్చి చేరింది. హ్యాంగర్ క్లాస్ సబ్‌మెరైన్‌ను చైనాతో కలిసి ఆ దేశం సంయుక్తంగా నిర్మించింది. గురువారం కరాచీ పోర్టుకు ఆ సబ్‌మెరైన్ చేరుకున్నది. పాకిస్థాన్ నౌకాదళం ఆధునీకరణలో భాగంగా ఆ సబ్‌మెరైన్ వచ్చేసింది. పాకిస్థాన్ నేవీ డాక్‌యార్డ్‌కు చేరుకున్న సమయంలో రిసెప్షన్ సెర్మనీ నిర్వహించారు. కమాండర్ ఫ్లీట్ వైస్ అడ్మిరల్ అబ్దుల్ మునిబ్ చీఫ్ గెస్ట్‌గా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేవీ ఆఫీసర్లు, సిబ్బంది, కుటుంబసభ్యులు వెల్కమ్ కార్యక్రమంలో పాల్గొన్నట్లు పాకిస్థాన్ నేవీ ప్రకటన చేసింది. పాకిస్థాన్ నేవల్ అకాడమీకి చెందిన క్యాడెట్లు సంప్రదాయ సెల్యూట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఎన్ జెడ్9ఈసీ హెలికాప్టర్లతో ఫ్లై పాస్ట్ చేపట్టారు. 2015లో కుదిరిన ఒప్పందం ప్రకారం .. చైనాలోనే హ్యాంగర్ క్లాస్ సబ్‌మెరైన్‌ను నిర్మించారు. మొత్తం 8 జలాంతర్గాములను పాకిస్థాన్‌కుఅందించాలని గతంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. చైనాకు చెందిన సీఎస్ఐసీ కంపెనీ మొదటి నాలుగు సబ్‌మెరైన్లను నిర్మిస్తోంది. మిగితా నాలుగు సబ్‌మెరైన్ల నిర్మాణం, అసెంబ్లింగ్ పాకిస్థాన్‌లో జరుగుతోంది. ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ పద్ధతిలో కరాచీ షిప్‌యార్డులో వాటిని నిర్మించనున్నారు. హ్యాంగర్ అనే పదాన్ని బెంగాలీ నుంచి తీసుకున్నారు. దీనికి షార్క్ అని అర్థం వస్తుంది. 1971 కన్నా ముందున్న పరిస్థితులను గౌరవిస్తూ ఆ పేరు పెట్టినట్లు తెలుస్తోంది. 1971 కన్నా ముందు బంగ్లాదేశ్ .. పాకిస్థాన్‌లో భాగంగా ఉండేది. వాస్తవానికి ఒరిజినల్ హ్యాంగర్‌ను ఫ్రెంచ్ నిర్మిత డఫేన్ క్లాస్ సబ్‌మెరైన్‌గా గుర్తిస్తారు. పాకిస్థాన్ నేవీలో ఆ తరహా అటాక్ సబ్‌మెరైన్లు ఉన్నాయి. అయితే ఆధునిక హ్యాంగర్ క్లాస్ జలాంతర్గాముల్లో చాలా అడ్వాన్స్ ఫీచర్లు ఉంటాయి. వీటికి స్టీల్త్ సామర్థ్యం కూడా ఉంటుంది.

# ఎయిర్‌పోర్ట్‌లో మోడల్ హర్ష సన్నీ అరెస్ట్

## రూ. 11.82 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం



**హైదరాబాద్ :** భారీగా గంజాయి తరలిస్తూ గత సంవత్సరం 'మిసెస్ కేరళ' రన్నరప్, మోడల్ హర్ష సన్నీ (28) ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. బ్యాంకాక్ నుండి ముంబై వచ్చిన ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో కస్టమ్స్ అధికారులు హర్షలగేజీని చెక్ చేశారు. అందులో రూ. 11.82 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ గంజాయి (సుమారు 11 కిలోలకు పైగా) పట్టుబడిందిభారతదేశంలోకి నిషేధిత మాదకద్రవ్యాలను అక్రమంగా తరలించడానికి ప్రయత్నించిన ఆరోపణలపై కస్టమ్స్ అధికారులు హర్ష సన్నీని ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టు స్వాధీనం చేసుకున్న హైడ్రోపోనిక్ గంజాయి బరువు 11 కేజీలకు పైగా ఉందని, దాని మార్కెట్ విలువ సుమారు రూ. 11.82 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. సన్నీని ముంబైలోని ఫోర్ట్ కోర్టులో హాజరుపరచగా కోర్టు ఆమెకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# నీట్ రీఎగ్జామ్‌లో కీలక మార్పులు పరీక్ష టైం పెంపు,

## రఫ్ వర్క్‌కు అదనపు పేపర్లు కీలక సూచనలివి




**హైదరాబాద్ :** మెడికల్ విద్యలో ప్రవేశం కోసం దేశవ్యా ప్తంగా నిర్వహించనున్న నీట్ రీఎగ్జామ్ 2026 పరీక్ష ఈ నెల 21న జరగనుంది. ఇది రీ ఎగ్జామ్ అనే సంగతి తెలిసిందే. ఈ పరీక్ష కోసం అభ్యర్తులు దేశవ్యాప్తంగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే, గతంలో జరిగిన పొరపాట్లను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎన్‌టీయే (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) కీలక మార్పులు చేసింది. విద్యార్తులపై ఒత్తిడి తగ్గేలా, వారికి అనుకూలంగా నిర్ణయాలు తీసింది. పరీక్ష రాసే సమయాన్ని పెంచింది. గతంలో మూడు గంటలు ఉండే పరీక్ష ఇప్పుడు మరో 15 నిమిషాలు అదనంగా జరగనుంది. మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 05.15 గంటల వరకు పరీక్ష జరగనుంది. అలాగే, విద్యార్తులు రఫ్ వర్క్ చేసుకునేందుకు అదనంగా రఫ్ వర్క్ షీట్లను కేటాయించనున్నారు. ఇంతకుముందు కొశ్చన్‌పేపర్‌తో పాటు రెండు పేజీలను మాత్రమే రఫ్ వర్క్ కోసం కేటాయించేవారు. ఇప్పుడు జరగబోయే పరీక్షలో మాత్రం నాలుగు రఫ్ వర్క్ పేపర్లు ఉంటాయి. అలాగే, ఎడమచేతి వాటం ఉన్న అభ్యర్థుల కోసం, వారికి అనుకూలంగా రఫ్ వర్క్ పేజీలను రీడిజైన్ చేశారు. బుక్‌లెట్ చివర్లో ఉండే రఫ్ వర్క్ పేపర్లలో రెండు పేజీలు బుక్‌లెట్ ఓపెన్ చేయగానే కనిపిస్తాయి. అన్ని భాషల వారికి కూడా ఇదే పద్ధతి వర్తిస్తుంది.

అలాగే, గతంలో ఒరిజినల్ డాక్యు మెంట్లు, హాల్ టికెట్ వెరిఫికేషన్, సైనింగ్ వంటి ఇన్విజిలేషన్ యాక్టివిటీస్ కోసం టైం వేస్ట్ అయ్యేది. అయితే, ఇప్పుడు దీనికోసం అదనపు సమయం కేటాయిస్తారు. ఈ చిన్నచిన్న మార్పులు విద్యార్తులకు మరింత ప్రయోజనంకలిగిస్తాయనిఎన్‌టీయే పేర్కొంది.

# మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగం


## మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదు



**పశ్చిమ బెంగాల్:** టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దక్షి ణ కోల్‌కతాలోని నేతాజి నగర్ పోలీస్ స్టేష న్‌లో కోల్‌కతాకు చెందిన ఒక వ్యక్తి మమతపై ఫిర్యాదు చేశాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మమత గత మార్చిలో ధర్మతలలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఒకవర్గానికి వ్యతిరే కంగా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్య లు చేశారని ఆమెపై నమోదైన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి మీరు క్షేమంగా ఉన్నారని, లేకుంటే ఒక వర్గం చేతిలో అణిచివేతకు గుర య్యేవారు అంటూ అప్పట్లో మమత వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఆమె వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు, భయం పెంపొందించేలా, ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా మమత వ్యవహరించారని ఫిర్యాదులో వివరించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. మే 20న ఈ ఫిర్యాదు దాఖలైంది. శుక్రవారం ఈ ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మమతకు తాజా రాజకీయ పరిణామాలు ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే. పార్టీకి చెందిన మెజారిటీ నేతలు టీఎంసీని వీడుతున్నారు. ఎంపీలు రెబల్స్‌గా ఏర్పడి బీజేపీకి మద్దతు ప్రకటించారు. తమను ప్రత్యేక వర్గంగా చూడాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. మరోవైపు ఎమ్మెల్యేలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో పశ్చిమ బెంగాల్‌లో ఇప్పుడు టీఎంసీ భవితవ్యంతోపాటు మమత రాజకీయ భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగా మారింది.

# ఈ దొంగలు మామూలోళ్లు కాదు

## పట్టపగలు 132 అడుగుల మొబైల్ టవర్‌నే ఎత్తుకెళ్లారు



**హైదరాబాద్ :** జనవాసాల మధ్య ఉన్న భారీ మొబైల్ టవర్)ఒక్కసారిగా మాయమైపోయింది. ఈ వింత సంఘటన స్థానికులతో పాటు పోలీసు యంత్రాంగాన్ని కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. 132 అడుగుల ఎత్తైన మొబైల్ టవర్‌తో పాటు 15 కేవీఏ జనరేటర్‌ను సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టపగలు.. బహిరంగంగా అందరూ చూస్తుండగానే ఈ దొంగతనాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. బీహార్‌లోనిబక్సర్ జిల్లా డుమ్రాన్‌లో ఈ విచిత్రమైన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే..కొన్ని సంవత్సరాలు పని చేయకుండా నిలిచిపోయిన మొబైల్ టవర్‌ను మరమ్మతులు చేయడానికి జీటీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చంఅధికారులు, సిబ్బంది డుమ్రాన్ వెళ్లారు. అక్కడికి వెళ్లి చూడగా 132 అడుగుల మొబైల్ టవర్ కనిపించలేదు. ఒకప్పుడు భారీ నిర్మాణం ఉన్న చోట వారికి ఖాళీ స్థలం తప్ప మరేమీ కనిపించకపోడంతో అందరు షాక్‌కు గురయ్యారు. టవర్‌తో పాటు ఇతర సాంకేతిక పరికరాలు కూడా అదృశ్యమయ్యాయి. వెంటనే జీటీఎల్ కంపెనీ ప్రతినిధి డుమ్రాన్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, దొంగలు పథకం ప్రకారం కొద్ది రోజులుగా టవర్, జనరేటర్‌కు సంబంధించిన పరికరాలను క్రమ పద్ధతిలో విడదీశారు. ఈ తతంగాన్ని చూసిన స్థానికులు మొబైల్ టవర్ కార్మికులే అధికారికంగా వాటిని తొలగిస్తున్నారని భావించారు.

తీరా అది కంపెనీ వాళ్లుకాదు దొంగలు అని తెలిసేసరికి విస్తుపోవడం జనం వంతయింది.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు లక్నోలో

## టేకాఫ్‌కు ముందే ప్రయాణికుల దింపివేత




**లక్నో:** ఇండిగో విమానానికి శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చింది. జూన్ 12న లక్నో నుంచి ఢిల్లీ బయల్దేరాల్సిన విమానానికి బాంబు బెదిరింపు వచ్చిందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. విమానం టేకాఫ్ కావడానికి కొద్ది నిమిషాల ముందు బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న భద్రతాదళాలు వేగంగా స్పందించాయి. విమానాన్ని నిలిపివేశారు. విమానంలోని ప్రయాణికుల్ని, సిబ్బందిని దింపివేశారు. దూరంగా నిలిపి తనిఖీలు చేపడుతున్నారు. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)తో పాటు స్థానిక పోలీసులు ఈ సెక్యూరిటీ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్నారు. సెక్యూరిటీ ప్రొటోకాల్ ప్రకారం అధికారులు విమానంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులకు సమాచారాన్ని చేరవేసి, వారి కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బాంబు బెదిరింపు కాల్ తర్వాత కొద్దిసేపు విమాన సేవలకు ఎయిర్‌పోర్టులో అంతరాయం కలిగింది. కొన్ని విమాన సర్వీసులకు ఆలస్యం కానున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

# రాజ్యసభకు 24 మంది ఏకగ్రీవంగా ఎన్నిక గెలిచిన ఎంపీలు, పార్టీల బ్రేకప్ వివరాలివి



రాజ్యసభ 2026కు సంబంధించిన ఎన్నికలు తాజాగా జరిగాయి. మొత్తం 27 స్థానాలకు నోటిఫికేషన్ వెలువడి ఎన్నిక జరగగా.. అందులో 24 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలిచారు. గురువారం ఫలితాలు వెలువడాయి. వీరిలో 19 మంది బీజేపీ (ఎన్‌డీయే) అభ్యర్థులుకాగా, మిగతా ఐదుగురు కాంగ్రెస్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మరోసారి ఎంపీగా గెలిచారు. కాంగ్రెస్ నుంచి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత రాజ్యసభలో ఎన్‌డీయే స్థానాలు 3 పెరగగా, కాంగ్రెస్ ఒక సీటు పెంచుకుంది. ఇంతకు ముందు ఈ స్థానాల్లో ఎన్‌డీయే 16 రాజ్యసభ సీట్లు కలిగి ఉండేది. ఇప్పుడు 3 సీట్లు పెరిగాయి. ఇంతకుముందు ఇదే స్థానాల్లో కాంగ్రెస్ 4 సీట్లు కలిగి ఉండేది. ఇప్పుడు అదనంగా మరో సీటు గెలుచుకుంది. ఈ ఎన్నికల ద్వారా ఏపీకి చెందిన వైసీపీ.. మూడు రాజ్యసభ స్థానాల్ని కోల్పోయింది. అలాగే, ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్ కూడా ఒక సీటును బీజేపీకి కోల్పోవాల్సి వచ్చింది. తాజా ఫలితాల్లో పార్టీ ప్రకారం గెలిచిన సీట్ల వివరాలివి. ఏపీ నుంచి ఎన్‌డీయే కూటమికి చెందిన పార్టీలు టీడీపీ, జనసేనలు 4 స్థానాలు దక్కించుకున్నాయి.

TGTEL/25/A1132
జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# ఫ్రిజ్ లేకపోయినా తాజాగా



ఫ్రిజ్ లేకపోయినా తాజాగావారానికి ఒకసారి సంతకు వెళ్లి కూరగాయలు కొనుక్కొస్తాం. కానీ రెండు రోజులు గడవకముందే ఆకు కూరలు వాడిపోవడం, కూరగాయలు తేమ కోల్పోవడం, ఫ్రిజ్‌లో పెట్టినా త్వరగా పాడవడం చాలామంది ఇళ్లలో కనిపించే సమస్య. ఇలాంటి ఇబ్బందులకు పరిష్కారంగా ఇప్పుడు వంటగదుల్లోకి అడుగుపెడుతున్నాయి 'వెజిటబుల్ ప్రిజర్వేషన్ బ్యాగ్'లు. కూరగాయల తాజాదనాన్ని కాపాడుతూ ఆహార వృథాను తగ్గించడంలో ఇవి మనకు సాయపడతాయి. మనం వాడే సాధారణ ప్లాస్టిక్ కవర్లు కూరగాయలకు ఊపిరాడకుండా చేస్తాయి. వాటి నుండి వచ్చే తేమ ఆ కవర్ల లోపలే పేరుకుపోయి, బ్యాక్టీరియా చేరి త్వరగా కుళ్లిపోతాయి. కానీ, వెజిటబుల్ ప్రిజర్వేషన్ బ్యాగులు అలా కాదు. ఇవి ప్రకృతి సిద్ధమైన కాటన్, మస్లిన్ వస్త్రాలతో లేదా ప్రత్యేకమైన ఫుడ్‌గ్రేడ్ మెష్ మెటీరియల్‌తో తయారవుతాయి. ఇవి కూరగాయలకు సరిపడా గాలి ఆడేలా చేస్తూ, వాటి ఆయుష్షును పెంచుతాయి. ఈ బ్యాగుల ప్రత్యేకత ఏంటంటే, ఇవి కూరగాయలలోని తేమను సమతుల్యంగా ఉంచుతాయి. ఆకుకూరలు, బెండకాయలు, క్యారెట్లలాంటి వాటిని కాటన్ బ్యాగులలో ఉంచి, కాస్త నీళ్లు చల్లి ఫ్రిజ్‌లో పెడితే.. వారం రోజులైనా ఇప్పుడే తోట నుంచి కోసుకొచ్చినట్లు తాజాగా ఉంటాయి. అలాగే, ఇవి కూరగాయలు విడుదల చేసే 'ఇథిలిన్' గ్యాస్‌ను బయటకు పంపేయడం వల్ల త్వరగా ముదిరిపోవు.

ఉతికి, శుభ్రం చేసి ఎన్నిసార్లు అయినా తిరిగి వాడుకో గలిగిన ఈ బ్యాగులు పర్యావరణ హితకారులు కూడా

# కలుషితం కకావికలం



సురక్షితమైన ఆహారం.. కేవలం ఒక వ్యక్తిగత బాధ్యత కాదు. అది ఒక సామాజిక అవసరం. ఎందుకంటే, కలుషిత ఆహారం.. మానవాళి ఆరోగ్యాన్ని కకావికలం చేస్తున్నది. ఏటా 86.6 కోట్ల మంది అనారోగ్యాలకు, 15.2 లక్షల మంది మరణాలకు కారణం అవుతున్నది. వీరిలో ఐదేళ్లలోపు పిల్లలే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా చేపట్టిన అధ్యయనం.. ఈ విషయాన్ని వెల్లడించింది. 'ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్'లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. కలుషిత ఆహారం ద్వారా సంక్రమించే వ్యాధులలో దాదాపు మూడింట ఒకవంతు చిన్నపిల్లలే బాధితులుగా మారుతున్నారు. ముఖ్యంగా, ప్రాణాంతకంగా మారే అతిసార వ్యాధులతో సతమతం అవుతున్నారు. ఇందుకు కారణాలను అధ్యయనకారులు వివరించారు. చిన్నారుల్లో రోగనిరోధక వ్యవస్థ పూర్తిగా వృద్ధి చెందదు. పెద్దలు తట్టుకోగలిగే బ్యాక్టీరియాను వీరి శరీరం తట్టుకోలేదు. ఇక పిల్లల శరీర బరువు తక్కువగా ఉండటం వల్ల, ఆహారంలోని విషపదార్థాల ప్రభావం వీరిపై చాలా వేగంగా, తీవ్రంగా ఉంటుంది. ఈ కారణాల వల్ల కలుషిత ఆహార బాధితుల్లో చిన్నారులే ఎక్కువగా ఉంటున్నారు. తీవ్రమైన విరేచనాలు, టైఫాయిడ్, హెపటైటిస్, అవయవాల వైఫల్యంతో మరణానికి చేరువ అవుతున్నారు. క్యాన్సర్, మెదడు ఎదుగుదలలో లోపాలతో జీవశ్చవాలుగా మారుతున్నారు. అంతేకాకుండా, ప్రమాదకర రసాయనాల ప్రభావంతో పిల్లల మెదడుకు తీవ్రమైన హాని కలుగుతున్నది. నాడీ సంబంధిత, అభివృద్ధిపరమైన సమస్యలు.. వీరిని జీవితాంతం వెంటాడుతున్నాయి. 2021లో ఆహారంలో రసాయన ప్రమాదాల కారణంగానే 73 శాతం మరణాలు సంభవించాయని అధ్యయనకారులు వెల్లడించారు. ఇందులోనూ అధిక భాగం మరణాలు.. ఇన్‌ఆర్గానిక్ ఆర్సెనిక్ (42 శాతం), సీసం (31 శాతం)తో ముడిపడి ఉన్నాయని తెలిపారు. ఈ ప్రమాదకర రసాయనాలకు గురికావడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ల ప్రమాదం పెరగడమే మరణాలకు కారణమని చెబుతున్నారు. 194 దేశాల నుంచి 42 ప్రధాన ఆహార సంబంధిత ప్రమాదాలను అంచనా వేసి ఈ విషయాలను కనుగొన్నారు. శుభ్రమైన నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత, పాశ్చరైజేషన్ వంటి ఆహార భద్రతా పద్ధతులతో కలుషిత ఆహారాన్ని అరికట్టవచ్చని చెబుతున్నారు. వాటితోపాటు బలహీన వర్గాల ప్రజలకు ఆరోగ్య సంరక్షణను అందుబాటులో ఉంచడం ద్వారా చిన్నారులను కాపాడుకోవచ్చని అంటున్నారు.

# ఎందుకలా మర్చిపోతున్నారు




'ఏమిటో ఈమధ్య అన్నీ మర్చిపోతున్నా...' యాభై దాటిన మహిళల్లో ఎక్కువమంది నుంచి వచ్చే మాట ఇది. మెనోపాజ్ అని సరిపెట్టుకుంటారే తప్ప చాలామంది దీన్నో సమస్యగానే గుర్తించరు. ఎందుకంటే మెనోపాజ్ దశలోనూ, ఆ తరవాత కూడా వేడి ఆవిర్లు, కుంగుబాటు, అలసట, ఆందోళన, మతిమరుపు, నిద్రపట్టకపోవడం... వంటి ఎన్నో సమస్యలు మహిళల్ని ఇబ్బంది పెడుతుంటాయి. హార్మోన్లలో మార్పులవల్ల ఇదంతా సహజమే అనుకుంటాం. అయితే అక్కడితోనే ఆగదు. దీని కారణంగా మెదడు నిర్మాణంలోనూ మార్పులొస్తున్నాయి అంటున్నారు నిపుణులు. మెనోపాజ్ వల్ల మెదడు లోని అనేక ప్రాంతాల్లో గ్రే మ్యాటర్ తగ్గినట్లు పలువురు పరిశోధకులు గుర్తించారు. కొందరిలో మానసిక కుంగుబాటు, మతిమరుపు, నిద్రలేమి వంటివి ఎక్కువగా ఉండటానికి ప్రధాన కారణం ఇదే అంటున్నారు. అయితే మెనోపాజ్ లక్షణాల్ని తగ్గించుకునేందుకు కొందరు హార్మోన్ల థెరపీనీ ఆశ్రయిస్తుంటారు. అలా తీసుకున్నవాళ్ల మెదడు నిర్మాణంలో పెద్దగా మార్పు కనిపించలేదు. కానీ లక్షణాలు మరింత తీవ్రతరం కాలేదని పరిశోధనలో వెల్లడైంది. అంటే, మెదడు ఆరోగ్యంలో వచ్చే కీలకమైన ఈ మార్పు కారణంగానే వృద్ధాప్యంలో మగవాళ్లతో పోలిస్తే ఆడవాళ్లే ఎక్కువగా డిమెన్షియా, ఆల్జిమర్స్ బారిన పడుతున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. అయితే ముందునుంచీ ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామాలతో కొంతవరకూ ఈ సమస్యల్ని అధిగమించవచ్చు. అలాగే మహిళల్లో వచ్చే ఈ మార్పుల్ని గమనించి కుటుంబసభ్యులూ వాళ్లకు అండగా ఉంటే సమస్య తీవ్రతని తగ్గించవచ్చని చెబుతున్నారు

# చాక్లెట్ గర్ల్‌కి




మెలికలు తిరిగి సిగ్గుపడాల్సిన అవసరం లేకుండానే బుగ్గలు కందిపోయే ఆప్షన్ ఒకటి ఉంది. అదే బ్లష్. ఇది ఓ చిటికెడు రాశారంటే చెంపల్లోకి కెంపు వర్ణం వచ్చి చేరిపోతుంది. ఇక్కడ చాక్లెట్‌లా కనిపిస్తున్నది అదే! చాక్లెట్లను అమితంగా ఇష్టపడే అమ్మాయిల కోసం అదే రూపంలో బ్లష్‌లను తయారుచేసి అందిస్తున్నాయి వివిధ సౌందర్య ఉత్పత్తుల సంస్థలు. అందులో ఎరుపు, పగడపు వన్నె, మెరూన్ లాంటి వివిధ వర్ణాలు అందుబాటులో ఉన్నాయి. మన శరీర ఛాయ, వేసుకున్న దుస్తులు, మేకప్‌ని బట్టి వీటిని ఎంచుకోవచ్చు. ఎంచక్కా అందంగా మెరిసిపోవచ్చు. తాము కొనే ప్రతి ఉత్పత్తి విభిన్నంగా ఉండాలనుకునే అమ్మాయిలకు ఇవి తెగ నచ్చేస్తున్నాయట. మరి ఎంతో ఇష్టమైన చాక్లెట్... బ్యూటీ ప్రొడక్ట్ ఒకే చోట కనిపిస్తే వదులుతారా మరి.

# ఫలరాజు అడ్డు కాదు



ఫలరాజు అడ్డు కాదుపండ్ల రాజుగా పిలుచుకునే మామిడి కోసం చాలామంది ఏడాది పొడవునా ఎదురుచూస్తుంటారు. అయితే, ఈ పండు ఎంత రుచిగా ఉంటుందో, బరువు తగ్గాలని ప్రయత్నించే వారి అవాయిడ్ లిస్ట్‌లో కూడా అంతే త్వరగా చేరిపోతుంది. మామిడి పండ్లు తింటే ఒంట్లో కొవ్వు పెరిగిపోతుందని, వెయిట్ లాస్ లక్ష్యాలు దెబ్బతింటాయని చాలామంది భయపడుతుంటారు. కానీ, అసలు సమస్య మామిడి పండులో లేదు, మనం దానిని తినే విధానంలోనే ఉందని ఫిట్‌నెస్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సరైన పరిమాణంలో, పద్ధతిగా తింటే బరువు తగ్గడానికి మామిడి పండ్లు అడ్డుకావని చెబుతున్నారు. మామిడి పండ్లను షుగర్ ఎకువగా ఉండే మిల్‌షేక్‌లుగా మార్చడం, ఆమ్స్‌లో అదనంగా చకెర కలపడం, అతిగా తినడం లేదా భారీగా భోజనం చేసిన తర్వాత మళ్లీ మామిడి పండ్లను డెజర్ట్‌గా తీసుకోవడం వల్ల శరీరంలో క్యాలరీల శాతం అమాంతం పెరిగిపోతుంది. ఈ రకమైన ఆహార అలవాట్లు బరువు పెరగడానికి కారణమవుతాయి తప్ప, కేవలం పండు మాత్రమే తినడం వల్ల కాదు. అందుకే మామిడి పండ్లను చకెర, సిరప్‌లు లేదా స్వీటెన్డ్ డైరీ ప్రొడక్ట్స్‌తో కలిపి ఎకువ క్యాలరీల డెజర్ట్‌గా మార్చవద్దు. దానిలోని సహజమైన పోషక విలువలు దెబ్బతినకుండా, క్యాలరీలు పెంగకుండా తినాలి. మామిడి పండును వేరే వాటితో కలపకుండా విడిగా ఒక స్నాక్‌లా ఎంజాయ్ చేయాలి. ఈ చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా బరువు తగ్గే లక్ష్యాలు దెబ్బతినకుండా ఈ సీజనల్ ఫ్రూట్‌ను మన సారా ఆస్వాదించవచ్చు. కేవలం ఒక పండును డైట్ నుంచి పూర్తిగా దూరం పెట్టడం వల్లే బరువు తగ్గిపోతారన్న వాదన సరైనది కాదు. దీర్ఘకాలికంగా బరువు అదుపులో ఉండటం అనేది మనం తీసుకునే మొత్తం క్యాలరీలు, క్వాంటిటీ కంట్రోల్, సరైన ఆహార ఎంపికలు, క్రమశిక్షణపై ఆధారపడి ఉంటుంది. స్వీట్స్ లేదా ఐస్ క్రీమ్స్ తినాలనే కోరిక కలిగినప్పుడు ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్స్ కంటే సహజమైన తీపి ఉండే మామిడి పండును తినడం ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం. మామిడి పండ్లు తినడం వల్ల ఫైబర్, అవసరమైన విటమిన్లు, సహజమైన తీపి మన శరీరానికి అందుతాయి. అందుకే మామిడి పండును చూసి భయపడాల్సిన అవసరం లేదు. దానిని సరైన పద్ధతిలో తినండి. మీ వెయిట్‌లాస్ జర్నీ ఎప్పటిలాగే సాగుతుంది.

# అన్నం పునుగులు




**కావలసిన పదార్థాలు**

అన్నం: కప్పు
బియ్యప్పిండి: పావు కప్పు
కొత్తిమీర: గుప్పెడు
అల్లం: చిన్న ముక్క
పచ్చిమిరపకాయలు: మూడు
కరివేపాకు: నాలుగు రెబ్బలు
బేకింగ్ సోడా: చిటికెడు
ఉప్పు: తగినంత
నూనె: వేయించడానికి సరిపడా

ముందుగా అన్నాన్ని మిక్సీలో వేసుకొని మెత్తగా మాష్ చేసుకోవాలి. బియ్యప్పిండిని ఇందులో కలుపుకోవాలి. కొత్తిమీర కరివేపాకులను సన్నగా తరుక్కోవాలి. అల్లం పచ్చిమిర్చిలను మిక్సీలో వేసి ముద్దగా చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు వీటన్నింటితో పాటు తగినంత ఉప్పు కొద్దిగా బేకింగ్ సోడాలని మాష్ చేసిన అన్నం మిశ్రమానికి కలుపుకోవాలి. బేకింగ్ సోడా వేశాక ఆ పిండిని చేత్తో బాగా కలియబెట్టాలి. దీనివల్ల పునుగులు బోలుగా వస్తాయి. కలపడం పూర్తయ్యాక పొయ్యి మీద నూనె పెట్టి గుండ్రటి బంతుల్లా వచ్చేలా కడాయిలో పునుగులు వేసుకుంటే సమ్మర్‌లో వెరైటీ స్నాక్స్ సిద్ధమైపోతాయి.

# పూవుల్లో దాగున్న



కొన్నిరకాల పూలలో 'ఇథిలిన్' గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల పూలు త్వరగా ముడుచుకుపోతాయి. అలాకాకుండా ఉండేందుకు పూలపై సిల్వర్ థియోసల్ఫేట్‌తో పిచికారీ చేస్తారు. ఇక పూలపై బ్యాక్టీరియా చేరకుండా ఉండేందుకు ఫ్లోరల్ ప్రిజర్వేటివ్స్‌తో కోటింగ్ చేస్తారు. పూల రేకులపై తేమ ఆవిరి కాకుండా, పూలు చాలారోజులపాటు తాజాగా ఉండేందుకు సింథటిక్ వ్యాక్స్, సింథటిక్ పాలిమర్లను స్ప్రే చేస్తారు. ఇవన్నీ పూలపై చేరి.. వాటిని వాడినప్పుడు తీవ్రమైన దుష్ప్రభావాలు కలిగిస్తాయి. రసాయనాలతో నిండిన పూలను ఎక్కువ సేపు పెట్టుకోవడం, పట్టుకోవడం వల్ల.. చర్మంపై దద్దుర్లు, దురద, అలర్జీలు వచ్చే అవకాశం ఉంది. ఈ పూలను నేరుగా ముక్కు దగ్గర పెట్టుకొని వాసన పీలిస్తే.. తలనొప్పి, మైకం వచ్చేస్తుంది. మరికొందరిలో తుమ్ములు, దగ్గుతోపాటు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బందులు ఏర్పడతాయి. పూలు వాడిపోయిన తర్వాత వాటిని పారేసినప్పుడు.. ఈ రసాయనాలు మట్టిలో, నీటిలో కలుస్తాయి. ముఖ్యంగా 'సిల్వర్' లాంటి లోహాలు జలచరాలకు హాని కలిగిస్తాయి.

కాబట్టి, బజార్‌లో కొనుగోలు చేసిన పూలను వాడే ముందు మంచి నీటిలో కొద్దిసేపు నిల్వ ఉంచి, తీసి ఆరబెట్టాలి. దీనివల్ల రసాయనాల ప్రభావం కొంతమేర తగ్గుతుంది. ఒకవేళ రైతుల నుంచి స్వచ్ఛమైన పూలు సేకరిస్తే.. వాటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచడానికి కొన్ని సంప్రదాయ పద్ధతులు పాటించాలి. లీటర్ నీటిలో ఒక టీస్పూన్ చక్కెర, రెండు టీస్పూన్‌ల నిమ్మరసం కలిపి.. ఆ నీటిలో పూలను కొద్దిసేపు ఉంచాలి. దీనివల్ల పూలు కొన్నిరోజుల పాటు తాజాగా ఉంటాయి.

### యోగా అంటే కేవలం వ్యాయామం మాత్రమే కాదు
## అనేక విధాలుగా దోహదం చేస్తుంది

ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళనలు, నిరంతర పరుగుల మధ్య ప్రశాంతత కోసం చాలామంది యోగాను ఆశ్రయిస్తున్నారు. సాధారణంగా యోగాను శారీరక దృఢత్వం, వశ్యతను పెంచే వ్యాయామంగా భావించినప్పటికీ, దాని ప్రభావం అంతకంటే చాలా ఎక్కువగా ఉంటుంది. యోగా శరీరాన్ని మాత్రమే కాకుండా మనసును, భావోద్వేగాలను, ఆత్మను కూడా సానుకూలంగా ప్రభావితం చేస్తుంది. క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం చెబుతున్నారు.

# రివర్స్ సైకాలజీ అంటే ఏమిటి దీన్ని ఎప్పుడు, ఎలా ఉపయోగించాలి

రివర్స్ సైకాలజీ అనే పదం వినగానే చాలా మందికి మానసిక ఆటలు లేదా ఇతరులను ప్రభావితం చేసే వ్యూహాలు గుర్తుకు వస్తాయి. అయితే దీని వెనుక ఉన్న అసలు సూత్రం మనుషులు నియంత్రణ, స్వేచ్ఛ, ఆసక్తి వంటి అంశాలకు ఎలా స్పందిస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఎవరైనా తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని భావిస్తే సహజంగానే వ్యతిరేకంగా స్పందించే అవకాశం ఉంటుంది. కానీ నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను ఇచ్చినప్పుడు లేదా స్వల్పంగా సవాలు చేసినప్పుడు, చాలామంది అనుకున్న దిశలోనే అడుగులు వేస్తారు. ఈ పద్ధతులు తల్లిదండ్రుల పెంపకం, మార్కెటింగ్, వ్యక్తిగత సంబంధాలు, అలాగే స్వీయ ప్రేరణలో కూడా కనిపిస్తాయి. అయితే వీటిని జాగ్రత్తగా ఉపయోగిస్తే సానుకూల ఫలితాలు ఇస్తాయి. నిర్లక్ష్యంగా ఉపయోగిస్తే నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది.

**బలవంతంగా ప్రోత్సహించాల్సి వస్తే..**

ఏదైనా విషయాన్ని బలవంతంగా ప్రోత్సహించకుండా, స్వల్పంగా తక్కువ చేసి చెప్పడం కూడా రివర్స్ సైకాలజీలో ఒక పద్ధతి. ఉదాహరణకు ఈ రెస్టారెంట్‌కి వెళ్లొచ్చు, కానీ అది మీ అభిరుచికి సరిపోకపోవచ్చు అని చెప్పడం. ఇలా చెప్పడం వల్ల ఎదుటివారికి తమ స్వేచ్ఛను గౌరవిస్తున్నారనే భావన కలుగుతుంది. అదే సమయంలో ఎందుకు నచ్చదు అనే ఆసక్తి కూడా పెరుగుతుంది. అయితే కొన్నిసార్లు వారు నిజంగానే ఆసక్తి చూపకుండా వదిలేస్తారు. ఈ పజిల్ మీకు సరిపోతుందో లేదో తెలియదు, ఇది చాలా కష్టమైనది వంటి వ్యాఖ్యలు వ్యక్తి గర్వాన్ని, సామర్థ్యాన్ని సవాలు చేస్తాయి. చాలామంది తమను తక్కువ అంచనా వేశారని భావించి ఆ పనిని చేసి చూపించాలని ప్రయత్నిస్తారు. అయితే ఈ వ్యాఖ్య వ్యంగ్యంగా లేదా అవమానకరంగా అనిపిస్తే ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

**ప్రత్యేకత చెప్పాలనుకుంటే..**

ఫోటోగ్రఫీపై నిజమైన ఆసక్తి ఉన్నవారికే ఈ వర్క్‌షాప్ నచ్చుతుంది వంటి వ్యాఖ్యలు ప్రత్యేకత భావనను కలిగిస్తాయి. పరిమితంగా లేదా ప్రత్యేకంగా కనిపించే విషయాలకు మనుషులు ఎక్కువ విలువ ఇస్తారు. మార్కెటింగ్‌లో ఈ పద్ధతిని విస్తృతంగా ఉపయోగిస్తారు. కానీ వాస్తవానికి లేని కొరతను సృష్టిస్తే, అది బయటపడినప్పుడు నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ వారాంతంలో నాకు సహాయం చేయాల్సిన అవసరం లేదు.. అని చెప్పడం రివర్స్ సైకాలజీకి క్లాసిక్ ఉదాహరణ. పైకి చూస్తే బాధ్యత నుంచి విముక్తి కల్పించినట్టే ఉంటుంది. కానీ లోపల మాత్రం ఎదుటివారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆశ ఉంటుంది. అయితే వారు ఆ మాటను అక్షరాలా తీసుకుని నిజంగానే సహాయం చేయకపోవచ్చు.

**సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని ఉంటే..**

ఈ ఆలోచనకు పెద్దగా స్పందన రాకపోవచ్చు అని చెప్పడం ద్వారా కొందరిలో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలనే కోరిక పెరుగుతుంది. ఇది అదనపు కృషికి ప్రేరణ ఇస్తుంది. కానీ ఆత్మవిశ్వాసం తక్కువగా ఉన్నవారిలో మాత్రం నిరుత్సాహాన్ని కలిగించే అవకాశం ఉంటుంది. ఈ రోజు జిమ్‌కు వెళ్లకపోయినా ఫరవాలేదు వంటి మాటలు ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో వ్యక్తి స్వయంగా సరైన నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనకు వస్తాడు. స్వతంత్రంగా ఆలోచించే వారిపై ఈ పద్ధతి బాగా పనిచేస్తుంది. అయితే ఇప్పటికే ప్రేరణ లేని వ్యక్తికి ఇది వదిలేయడానికి మరో కారణంగా మారుతుంది. ఏం చేసినా నేను కొన్న సర్‌ప్రైజ్‌ను చూడకం అనే వ్యాఖ్య ఆసక్తిని రేకెత్తిస్తుంది. మనిషి మనసు నిషేధించిన విషయాల పట్ల ఎక్కువ ఆకర్షితమవుతుంది. సరదా సందర్భాల్లో ఇది ప్రభావవంతంగా ఉంటుంది. కానీ తరచూ ఉపయోగిస్తే ఈ పద్ధతి తన ప్రభావాన్ని కోల్పోయి, కృత్రిమంగా లేదా మోసపూరితంగా అనిపిస్తుంది.

రివర్స్ సైకాలజీ అనేది ఇతరులను నియంత్రించే సాధనం కంటే, మానవ మనస్తత్వం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకునే ఒక ఆసక్తికరమైన విధానం. అయితే దీని విజయవంతమైన ఉపయోగం

TGTEL/25/A1132
జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ వీడ్కోలు!



న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటర్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు తక్షణమే వర్తించేలా రిటైర్మెంట్ ప్రకటించాడు. తన 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 378 మ్యాచ్‌లు ఆడిన కేన్.. 48 సెంచరీలతో 19,346 పరుగులు సాధించాడు. అతడి సారథ్యంలోనే న్యూజిలాండ్ 2021లో తొలి ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గదను ముద్దాడింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ మధ్యలోనే ఈ 35 ఏళ్ల క్లాసిక్ ప్లేయర్ వీడ్కోలు పలకడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. 35 ఏళ్ల కేన్ విలియమ్సన్.. న్యూజిలాండ్ తరఫున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20లు ఆడాడు. తన 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 19 వేలకుపైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి. కివీస్ తరఫున అత్యుత్తమ క్రికెటర్‌గా పేరు పొందిన విలియమ్సన్ అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పినట్లు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు శుక్రవారం (జూన్ 12, 2026) అధికారిక ప్రకటన విడుదల చేసింది. 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కేన్ విలియమన్స్ గతేడాది అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా వన్డే, టెస్ట్ ఫార్మాట్‌లకు సైతం వీడ్కోలు పలికాడు. "రిటైర్మెంట్ గురించి కొంతకాలంగా ఆలోచిస్తున్నా. అయితే నా వీడ్కోలుకు ఇదే సరైన సమయం అనిపించింది. 16 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మధురానుభూతులు ఉన్నాయి. కివీస్‌కు ఐసీసీ మేజర్ టోర్నీ లేదనే భావన మాలో బలంగా ఉండిపోయింది. కానీ 2021లో ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం ద్వారా మా ఖాతాలోనూ ఒక ఐసీసీ టైటిల్ వచ్చి చేరినట్లయింది. న్యూజిలాండ్ తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడడం నా అదృష్టంగా భావిస్తున్నా. అన్నీ ఆలోచించే రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకున్నా" అని కేన్ విలియమ్సన్ తన రిటైర్మెంట్ ప్రకటనలో రాసుకొచ్చాడు. కాగా కేన్ విలియమ్సన్ ఆటగాడిగా మాత్రమే కాకుండా సారథిగా కూడా తనదైన ముద్ర వేశాడు. 2016 నుంచి 2024 వరకు అంటే దాదాపు 8 ఏళ్ల పాటు న్యూజిలాండ్ జట్టుకు సారథ్యం వహించాడు. తన కెప్టెన్సీలో రెండుసార్లు ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్‌కు కివీస్‌ను చేర్చాడు. 2019 ప్రపంచకప్, 2021 టీ20 ప్రపంచకప్‌లో అతడు ఈ ఫీట్ సాధించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ గదను అందించాడు. ఇక కేన్ విలియమ్సన్ తన కెరీర్‌లో 110 టెస్టులాడి 9,515 పరుగులు, 175 వన్డేల్లో 7,256 పరుగులు, 93 టీ20ల్లో 2,575 పరుగులు పరుగులు చేశాడు. 40 టెస్టులు, 91 వన్డేలు, 75 టీ20ల్లో న్యూజిలాండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా తొలి టెస్టు లార్డ్స్‌లో జరిగింది. కేన్ విలియమ్సన్ కేరీర్‌లో ఇదే చివరి అంతర్జాతీయ మ్యాచ్

# అత్యంత బిజీ ఫాస్ట్ బౌలర్‌గా సిరాజ్



మహమ్మద్ సిరాజ్ .. పరిచయం అక్కర్లేని పేరు. హైదరాబాద్ గల్లీ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఈ పేసర్.. ఇప్పుడు టీమిండియాకు కీలకంగా మారాడు. ఒకప్పుడు బుమ్రాకు సపోర్టింగ్ రూల్‌లో మాత్రమే కనిపించిన ఇతడు.. ఇప్పుడు తనకంటూ ప్రత్యేకత సంపాదించాడు. టీమిండియా ప్రధాన పేసర్‌గా మారిపోయాడు. వైట్-బాల్ క్రికెట్‌లో ఎక్కువగా అవకాశాలు అందుకోలేకపోతున్న ఈ పేసర్.. టెస్టుల్లో మాత్రం సత్తాచాటుతున్నాడు. అంతేకాకుండా ఫిట్‌నెస్ విషయంలో ఎవరికీ అందనంతగా.. విరామం లేకుండా మ్యాచులు ఆడుతూ.. ఆదర్శనంగా నిలిస్తున్నాడు. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ అనే పదం తన డిక్షనరీలోనే లేదు అన్నట్లుగా దూసుకెళుతున్నాడు. దీంతో ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత బిజీగా ఉండే ఫాస్ట్ బౌలర్‌గా మారిపోయాడు. గతంలో భారత బౌలర్లకు వరుసగా క్రికెట్ మ్యాచులు ఆడేవారు. ఆప్షన్లు తక్కువగా ఉండటంతో కపిల్ దేవ్ లాంటి ప్లేయర్ విరామం లేకుండా మ్యాచ్‌లు ఆడేవాడు. ఆ తర్వాత జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మ కూడా ఇలాంటి క్రికెటే ఆడారు. కానీ బుమ్రా రాకతో పరిస్థితి మారిపోయింది. అతడి ప్రదర్శన దృష్ట్యా.. బీసీసీఐ అతడిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. పనిభారం దృష్ట్యా పరిమిత సంఖ్యలోనే అతడిని మ్యాచ్‌లు ఆడిస్తూ వస్తోంది. దీంతో బుమ్రా గైర్హాజరీలో పేస్ దళాన్ని నడిపించే వ్యక్తి జట్టుకు అవసరమయ్యాడు. అలాంటి సమయంలో నేనున్నా అంటూ ముందుకొచ్చాడు సిరాజ్. అప్పటి నుంచి బిజీగా మారిపోయాడు. 2023 జనవరి నుంచి సిరాజ్ టెస్టులు, వన్డేలు, టీ20లు, ఐపీఎల్‌లో కలిపి 1,231 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఈ వ్యవధిలో ఇన్ని ఓవర్లు వేసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ అతడే. ముఖ్యంగా సిరాజ్ టెస్టుల్లో కీలక పేసర్‌గా మారిపోయాడు. ఏకంగా 30 మ్యాచ్‌లలో 744 ఓవర్లు వేశాడు. అంటే దాదాపు ప్రతి టెస్టులో 25 ఓవర్లు వేశాడన్నమాట. మరో మాటలో చెప్పాలంటే, ఫాస్ట్ బౌలర్లపై అత్యధిక శారీరక శ్రమను పెట్టే ఫార్మాట్‌లోనే సిరాజ్ మొత్తం పనిభారంలో 60 శాతం ఉంది. అందుకే వైట్ బాల్ క్రికెట్‌లో సిరాజ్ అవసరం లేదనిపిస్తున్నా.. రెడ్ బాల్ క్రికెట్‌లో మాత్రం తప్పనిసరిగా ఎంపిక చేయాల్సిన పరిస్థితి కల్పించాడు. 2023 నుంచి భారత్ 33 టెస్టులు ఆడగా, సిరాజ్ వాటిలో 30 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇదే సమయంలో బుమ్రా.. కేవలం మూడింట రెండు వంతుల టెస్టులు ఆడాడు. 2025లో భారత్ ఇంగ్లాండ్‌లో పర్యటించినప్పుడు, సిరాజ్ ఐదు టెస్టుల్లోనూ ఆడిన ఏకైక భారత సీమర్‌గా నిలిచాడు. 185 ఓవర్లు బౌలింగ్ చేసి జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ముందున్న కఠిన సీజన్, వన్డే ప్రపంచకప్, టెస్టుల్లో సిరాజ్ అవసరాన్ని గుర్తించే సెలక్టర్లు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20ల నుంచి సిరాజ్‌కు విశ్రాంతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో భారత్ 17 వన్డేలు, 10 టెస్టులు ఆడాల్సి ఉంది. వన్డే ప్రపంచకప్ 2027 దృష్ట్యా.. బీసీసీఐ బుమ్రాతో పాటు.. సిరాజ్ పనిభారాన్ని కూడా ఇకపై పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం సిరాజ్ ఫిట్‌గా ఉన్నాడు, పనిభారం అనే పదం అతడికి అవసరం లేదు. కానీ సిరాజ్ మ్యాచ్ ఆడని పరిస్థితి తలెత్తకూడదనే ఉద్దేశంలో సెలక్టర్లు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు!

# సచిన్ రికార్డు బద్దలు కొట్టిన వైభవ్



ఇండియా క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టి20 టూర్‌కు సెలెక్ట్ అయి ఆల్రెడీ సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేసిన ఈ యంగ్ సెన్సేషన్ సీనియర్ టీమ్ డెబ్యూ కోసం ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇతను శ్రీలంకలో ఇండియా ఏ టీమ్ తరఫున ట్రయాంగులర్ సిరీస్ ఆడుతున్నాడు. అయితే ఈ నెల చివర్లో జరగబోయే ఐర్లాండ్ సిరీస్‌కు అక్కడ జరుగుతున్న కమ్యూనిటీ అల్లర్లు, గొడవలు ఒక పెద్ద థ్రెట్‌గా మారాయి. ఐర్లాండ్‌లో పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో లిస్‌బర్న్‌లో జరగాల్సిన ఇంటర్-ప్రొవిన్షియల్ టి20 ఫెస్టివల్‌ను ఇప్పటికే క్యాన్సిల్ చేశారు. ఈ ఆదివారం జరగబోయే ఐరిష్ సీనియర్ కప్, నేషనల్ కప్ మ్యాచ్‌ల నిర్వహణపై రాబోయే 48 గంటల్లో డెసిషన్ తీసుకుంటామని క్రికెట్ ఐర్లాండ్ బోర్డు తెలిపింది. ప్లేయర్స్, కోచ్‌లు, సపోర్టర్ల సేఫ్టీ తమకు అత్యంత ముఖ్యమని, లోకల్ అథారిటీస్‌తో నిరంతరం కాంటాక్ట్‌లో ఉన్నామని బోర్డు చెప్పింది. ఒకవేళ అక్కడ పరిస్థితులు కంట్రోల్‌లోకి రాకపోతే ఇండియా, ఐర్లాండ్ సిరీస్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉంది. ఈ ఇష్యూను బీసీసీఐ కూడా క్లోజ్‌గా మానిటర్ చేస్తోందని, బెల్‌ఫాస్ట్‌లో గొడవలు తగ్గకపోతే మ్యాచ్‌లను వేరే వెన్యూకు షిఫ్ట్ చేసే ఛాన్స్ ఉందని సమాచారం. ఐపిఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతూ సిక్సర్ల వర్షం కురిపించిన వైభవ్ సూర్యవంశీ, ఇప్పుడు ఇండియా ఏ టీమ్ తరఫున వన్డే ఫార్మాట్‌లో మాత్రం క్లాస్ అప్రోచ్ చూపిస్తున్నాడు. గురువారం ఆఫ్ఘనిస్తాన్ ఏ టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ 22 బంతుల్లో 44 రన్స్ చేసి అవుట్ అయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను ఒక్క సిక్స్ కూడా కొట్టకుండా కేవలం గ్రౌండ్ షాట్స్ ఆడటం విశేషం. ఐపిఎల్ తరహాలో కాకుండా వన్డే ఫార్మాట్‌కు తగ్గట్లు చాలా మెచ్యూర్డ్‌గా బ్యాటింగ్ చేశాడు. అయితే వైభవ్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ ఈ మ్యాచ్‌లో ఇండియా ఏ జట్టు ఆఫ్ఘనిస్తాన్ ఏ చేతిలో ఓడిపోయింది. ఈ అల్లర్ల సమస్య కనుక సాల్వ్ అయితే ఐర్లాండ్ గడ్డపై వైభవ్ సూర్యవంశీ హిస్టరీ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అతి చిన్న వయసులోనే టీమిండియా క్యాప్ అందుకోబోతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ పర్ఫార్మెన్స్ ఎలా ఉంటుందో చూడాలని మేనేజ్‌మెంట్ కూడా ఆశగా ఉంది. కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ఈ యంగ్ టాలెంట్‌ను ఇంటర్నేషనల్ లెవెల్లో టెస్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నాడు.

# గిల్ వల్లే గుజరాత్ ఆటగాళ్లకు టీమిండియాలో చోటు

**- మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా**

కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వల్లే గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లకు భారత జట్టులో చోటు దక్కుతుందని మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. అయితే ఇది కొత్త కాదని, ధోనీ, కోహ్లీ, రోహిత్ శర్మ హయాంలోనూ ఈ విధానం కొనసాగిందని గుర్తు చేశాడు. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో గుజరాత్ టైటాన్స్‌కు చెందిన ఏడుగురు ఆటగాళు ఉండటం విమర్శలకు దారి తీసింది. సోషల్ మీడియా వేదికగా టీమిండియా.. గుజరాత్ టైటాన్స్‌గా మారిపోయిందనే మీమ్స్ హల్‌ఛల్ చేశాయి. ఈ విమర్శలపై ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా స్పందించాడు. 'సోషల్ మీడియాలో నేను కూడా చాలా మీమ్స్ చూశాను. గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ స్కోర్‌కార్డులో కుల్దీప్ యాదవ్ ఏం చేస్తున్నాడని కొందరు, కగిసో రబాడను ఎందుకు పక్కన పెట్టారని మరికొందరు మీమ్స్ వేశారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా ఉన్నాడు కాబట్టే గుజరాత్ ప్లేయర్లందరికీ భారత జట్టులో చోటు దక్కుతోందనే భావన అభిమానుల్లో ఎందుకు ఉందో నాకు అర్థమవుతోంది. వేసుకోవాలి. వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోకుండా ఉండాల్సిందా? ఖచ్చితంగా అతడికి చోటు దక్కాలి. మానవ్ సుతార్ తన ఎంపిక సరైనదేనని ప్రదర్శనతో నిరూపించుకున్నాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల ఎంపికపై ఎలాంటి సందేహాలు లేవు. సాయి సుదర్శన్ అంతకుముందే జట్టులో భాగమయ్యాడు. ఈ కోణంలో చూస్తే.. గిల్ లేదా కెఎల్ రాహుల్ ఎవరు కెప్టెన్‌గా ఉన్నా ఈ ఆటగాళ్లకు ఎలాగైనా జట్టులో చోటు దక్కేది. అయితే ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు. ధోనీ హయాంలో కూడా చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాళ్లకు టీమిండియాలో అవకాశాలు దక్కేవి.


# జట్టులోకి యశస్వి జైస్వాల్..



అఫ్గానిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌కు టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దూరమయ్యాడు. తొడ కండరాల గాయంతో చివరి నిమిషంలో ఈ సిరీస్‌కు అందుబాటులో లేకుండా పోయిన సంగతి తెలిసిందే. దాంతో అతని స్థానంలో యశస్వి జైస్వాల్‌ను సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. అయితే విరాట్ కోహ్లీ స్థానంలో దేవుడి బిడ్డ అయిన ఇషాన్ కిషన్ బరిలోకి దిగుతాడని, యశస్వి జైస్వాల్‌కు తుది జట్టులో అవకాశం దక్కదని మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఆకాష్ చోప్రా అన్నాడు. శనివారం ధర్మశాల వేదికగా జరిగే తొలి వన్డేతో ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. టీమిండియా తుది జట్టు ఎంపికపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన ఆకాశ్ చోప్రా..ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీ స్థానంలో యశస్వి జైస్వాల్‌ను ఎంపిక చేసినా.. తుది జట్టులో ఇషాన్ కిషన్‌ను ఆడించాలని ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఫ్ర 'టీమిండియాలో ఇషాన్ కిషన్ దేవుడి బిడ్డ. అనుకోకుండా అవకాశం వచ్చిన ప్రతీసారి అతను సత్తా చాటాడు. వన్డే సిరీస్‌లో అతను గనుక మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తే కచ్చితంగా పరుగులు చేస్తాడు. ప్రస్తుతం అతను అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు.'అని ఆకాష్ చోప్రా చెప్పుకొచ్చాడు. బీసీసీఐ కాంట్రాక్ట్ కోల్పోయి భారత జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్ అనూహ్యంగా రీఎంట్రీ ఇచ్చాడు. కెప్టెన్‌గా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్‌కు తొలి టైటిల్ అందించాడు. ఆ తర్వాత టీ20 ప్రపంచకప్ 2026లో సత్తా చాటాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ చెలరేగాడు. మరోవైపు రిషభ్ పంత్ ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతుండగా.. ఇషాన్ కిషన్ మాత్రం రీఎంట్రీలో సత్తా చాటుతున్నాడు. ఇప్పటి వరకు 27 వన్డేలు ఆడిన ఇషాన్ కిషన్ 42.40 సగటుతో 933 పరుగులు చేశాడు. బంగ్లాదేశ్‌పై అతను చేసిన 210 పరుగులే అతని అత్యధిక స్కోర్. ఆకాష్ చోప్రా భారత తుది జట్టు(అంచనా): రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ప్రసిధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

# టీమిండియాను ఓడించాలంటే అదక్కొట్టే మార్గం..

## • పాక్ జట్టుకు కోచ్ వహాబ్ రియాజ్ హితబోధ




ఇంగ్లాండ్ వేదికగా జూన్ 12న మహిళల టి20 ప్రపంచకప్ ఆరంభం కానుంది. ఈ టోర్నీలో తమ జట్టు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని, దూకుడే మంత్రంగా సాగుతుందని పాకిస్తాన్ మహిళల జట్టు కోచ్ వహాబ్ రియాజ్ స్పష్టం చేశారు. ఒక కఠినమైన గ్రూప్‌లో ఉన్నప్పటికీ.. ఆటగాళ్లు ఒత్తిడికి లోనుకాకుండా, లభించిన ఈ మెగా వేదికను ఆస్వాదిస్తూ తమ సహజమైన నైపుణ్యాలను ప్రదర్శించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని జట్టుకు సూచించినట్లు ఆయన తెలిపారు. "ప్రపంచకప్‌లో ఆడటం అనేది ప్రతి ఆటగాడి కల. ఫలితం ఎలా ఉన్నా సరే.. మైదానంలోకి వెళ్లి మ్యాచ్‌ను ఆస్వాదించండి, మీ ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శిస్తూ దూకుడుగా క్రికెట్ ఆడండి అని నా ఆటగాళ్లకు చెప్పాను" అని వహాబ్ రియాజ్ పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ జట్టు.. సాంప్రదాయ ప్రత్యర్థి భారత్, డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, నెదర్లాండ్స్ మరియు బంగ్లాదేశ్‌లతో కలిసి ఒకే పూల్‌లో ఉంది. గ్రూప్ దశ ఎంత కఠినంగా ఉన్నప్పటికీ, తమ ప్రాథమిక లక్ష్యం సెమీఫైనల్స్ బెర్తును ఖరారు చేసుకోవడమేనని వహాబ్ స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో పాకిస్తాన్ మహిళల జట్టు వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతోంది. అయితే, ఈ ఓటములు తమకు ప్రపంచకప్ ముందస్తు సన్నాహకంగా బాగా ఉపయోగపడ్డాయని కోచ్ అభిప్రాయపడ్డారు. "ఇటీవలి ఫలితాలు మాకు అనుకూలంగా రాకపోయినప్పటికీ.. ఐర్లాండ్ పర్యటన, అలాగే ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లు ఆడటం వల్ల మా ప్లేయర్లకు మంచి ఎక్స్‌పోజర్ లభించింది. ఇక్కడి వాతావరణం, పిచ్‌లు పాకిస్తాన్‌తో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటాయి.

కానీ, ఆ వ్యత్యాసాల గురించి ఆందోళన చెందకుండా తమ సహజమైన ఆటను ఆడాలని జట్టుకు స్పష్టం చేశాం" అని వహాబ్ వివరిం చారు. ట్వంటీ-20 ఫార్మాట్‌లో ముందే ఏదీ అంచనా వేయలేమని, మ్యాచ్ ఏ క్షణంలోనైనా మలుపు తిరగొచ్చని ఆయన గుర్తుచేశారు. "టీ20 క్రికెట్‌లో ఏ ఫలితమైనా సాధ్యమే. మేము గెలవగలమనే బలమైన నమ్మకంతోనే ప్రతి గ్రూప్ మ్యాచ్‌లో బరిలోకి దిగు తాం. మా జట్టులో అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో పాటు ప్రతిభావంతులైన యువ ఆటగాళ్ల మంచి కాంబినేషన్ ఉంది. వరల్డ్ కప్‌లో రాణించాలంటే ప్రత్యర్థి ఎవరనేది పక్కనబెట్టి, మన సామర్థ్యంపై మనకు నమ్మకం ఉండాలి" అని వహాబ్ ధీమా వ్యక్తం చేశారు. పాకిస్తాన్ జట్టు ఇంగ్లాండ్ చేరుకున్నప్పటి నుండి ఇప్పటివరకు ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేదు. ఐర్లాండ్‌లో జరిగిన త్రైపాక్షిక సిరీస్‌లో ఐర్లాండ్, వెస్టిండీస్ చేతిలో ఓడిపోగా.. ఆ తర్వాత జరిగిన అధికారిక వార్మప్ మ్యాచ్‌లలో శ్రీలంక, స్కాట్లాండ్ చేతుల్లోనూ పరాజయం పాలైంది. అయినప్పటికీ, ఇంగ్లాండ్‌లోని పిచ్‌లు తమ బలానికి సరిపోతాయని వహాబ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లండ్ వాతావరణంలో ఇక్కడి పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలిస్తాయని, తమ జట్టులోని ప్రధాన బలం స్పిన్ బౌలింగేనని ఆయన ముగించారు. పాకిస్తాన్ మహిళల జట్టు తన తొలి మ్యాచ్‌లో జూన్ 14 (ఆదివారం) న బర్మింగ్‌హామ్ వేదికగా చిరకాల ప్రత్యర్థి భారత్‌తో తలపడనుంది.

TGTEL/25/A1132
జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# పూరీ మార్క్... స్లమ్ డాగ్ టీజర్



డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.

--------

# మాటే పాటయితే..సింగీతం తరహా మూవీ

## సింగ్ గీతంతో

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా బ ా గ స్తు డి గా




చేర్చుకుంటారు. అప్పటికే ఆ ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా, విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం. అసలు ఇలాంటి ఆలోచన రావడమే నిజంగా గొప్ప విషయం. ఈ విభిన్నమైన కథ ద్వారా చాలా గొప్ప విషయాలను స్పృశించారు సింగీతం. పచ్చని చెట్టు బంగారం కంటే మిన్న అనే సందేశం ఈ సినిమాతో ఆయనిచ్చారు. పర్యావరణం గొప్ప తనాన్ని తెలిపేలా ఈ సినిమా తీశారు. సింగీతం విజన్‌ని, తెరపైకి తెచ్చేందుకు నాగ్ అశ్విన్ పడిన కష్టం అణువణువునా కనిపించింది. ఈ ప్రయోగం జనానికి ఎక్కితే, ఇది కచ్చితంగా మరో గొప్ప ప్రయత్నం అవుతుందని చెప్పక తప్పదు.

. ప్రయోగాత్మక చిత్రాలు ఇష్టపడే వాళ్లకు 'సింగ్ గీతం' కచ్చితంగా కొత్త అనుభూతిని ఇస్తుంది.



# నానీ మూవీలో రుక్మిణీ వసంత్

సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.

---------

# కిరణ్ అబ్బవరం కెఎ 13

## సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు



యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

# జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృతిక్ ?

సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మీనన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# మా ఇంటి బంగారం సమంత కోసం వెయిటింగ్

మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించారు. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇది సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యూఏ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించింది. 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన యాక్షన్ చిత్రమిది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు.. వెచ్చించే సమయానికి.. అన్నింటికీ న్యాయం చేసేలా ఉంటుంది' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సంతోష్ నారాయణన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్.



PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com